ANN తెలుగు

Follow: @ANNTELUGU

02-03-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 64 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM





## ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం

### ట్రంప్ సంచలన ప్రకటన

**మహా:** "ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది. టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**టాప్ న్యూస్**

నేడు తెలంగాణకు రాహుల్ గాంధీ
- రాష్ట్రంలో ఏడుగంటలు..
- రాజ్యసభ సభ్యుల ఎంపిక కలిక్కి



02

సెమీస్ కు టీమిండియా
- డూ ఆర్ డై మ్యాచ్ లో విన్
- విండీస్ ను చిత్తక్కొట్టిన శాంసన్



03

ఇజ్రాయెల్, పాకిస్థాన్ పక్క దేశాలను బతకనివ్వవు
- ఖమేనీ హత్య అన్యాయం
- ఓవైసీ ఫైర్



02

### ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా

## అయతొల్లా అరాఫీ



**మహా:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన వారసుడిగా అయతొల్లా అలిరెజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ఆదివారం నియమించింది. టెహ్రాన్‌లోని నివాసంపై అమెరికాఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీ మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇస్లామిక్ విప్లవ నేత ఖొమేనీ మరణం తర్వాత, 1989 నుంచి ఖమేనీ ఇరాన్ అత్యున్నత నాయకుడిగా కొనసాగుతూ వచ్చారు. ఖమేనీ మరణం తర్వాత దేశ పాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, జ్యుడీషియరీ చీఫ్ గులాంహుస్సేన్ మొహసెని ఎజెయి, గార్డియన్ కౌన్సిల్ జ్యూరిస్ట్ ఉంటారని 'ఐఆర్ఎన్ఏ' (ఐఆర్ఎన్ఏ) వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, 88 మంది సభ్యులున్న అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ తదుపరి పూర్తిస్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ఈ కౌన్సిల్ బాధ్యతలు నిర్వహిస్తుంది. 1959లో ఇరాన్‌లోని మేబోద్‌లో జన్మించిన అయతొల్లా అరాఫీ, షియా మతగురువుగా, ఇస్లామిక్ న్యాయనిపుణుడిగా పేరు పొందారు. 2016 నుంచి ఇరాన్ ఇస్లామిక్ సెమినరీస్ మేనేజ్‌మెంట్ సెంటర్ హెడ్‌గా, ప్రఖ్యాత కోమ్ సెమినరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

# ఖమేనీ హతం

## పంతం నెరవేర్చుకున్న ట్రంప్, నెతన్యాహు



- మిడిల్ ఈస్ట్ లో తీవ్రవాదం పెంచిపోషించిన ఖమేనీ
- టెహ్రాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికాల దాడులు
- పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు
- ఇలాంటి ఛాన్స్ మిస్ చేసుకోవద్దు- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
- ఇరాన్ పౌరులు సహకరించాలని రిక్వెస్ట్
- ఇరాన్ తో పాటు సరిహద్దుల్లో ఉన్న ఉగ్రస్థావరాలపై దాడులు
- మూడుదశాబ్దాలుగా అనేక ఉగ్రసంస్థలకు ఊపిరిపోసిన ఖమేనీ
- ఖమేనీ అణ్వస్త్ర స్వప్నంపై 2016 నుండి ట్రంప్ పోరు
- 27 అమెరికా స్థావరాలపై ఇరాన్ కౌంటర్ ఎటాక్
- ఖమేనీది దారుణహత్య- రష్యా అధ్యక్షుడు పుతిన్
- పాక్ లో అల్లర్లు.. 12 మంది నిరసనకారులు మృతి
- ప్రపంచవ్యాప్తంగా వందల విమానాలు రద్దు.. ఎయిర్ పోర్టుల్లోనే ప్రయాణికులు

**మహా నెట్ వర్క్:** ఇరాన్ సుప్రీం లీడర్ 86 ఏళ్ల అయతుల్లా అలీ ఖమేనీ ఇక లేరు. అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాల సంయుక్త దాడిలో ఆయన చనిపోగా ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం ఉదయం ధ్రువీకరించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ కుమార్తె, మనవడు, కోడలు, అల్లుడు మరణించినట్లు పేర్కొంది. అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన సైనిక ఆపరేషన్‌లో ఖమేనీ హతమైనట్లు మొట్టమొదట ట్రంప్ తన ట్రూత్ సోషల్ ద్వారా ప్రకటించారు.

వివరాలు 2లో

## పశ్చిమాసియాలో మారణహోమం

వివరాలు 2లో



## గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు

### అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ సూచన

**హైదరాబాద్, మహా:** గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధ మేఘాలు అలుముకుంటున్న వేళ.. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఇరాన్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లోని పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

మిగతా 2లో




సాహిత్యం పేజీలో 4లో

## రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం

### మూసీ దండి మార్చ్ పాదయాత్రలో కేటీఆర్



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మూసీ ప్రాజెక్టులో భాగంగా పెద్ద ఎత్తున ఇళ్లను, భూములను, అపార్ట్‌మెంట్లను కోల్పోతున్న రాజేంద్రనగర్ ప్రాంతంలోని హైదర్ షా కోట్, మధుపార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధితులను కలిసి వారికి సంఘీభావం తెలిపారు. మూసీ బాధితుల కోసం వారు నిర్వహించిన 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో పాల్గొన్నారు. మూడున్నర కిలోమీటర్ల పాటు బాధితులను కలిశారు. ఆ తర్వాత మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ దగ్గర జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

మిగతా 3లో



## 444 భారత విమానాలు రద్దు
- పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతల ఎఫెక్ట్
- దుబాయ్ లో 20వేల ప్రయాణికుల ఇబ్బందులు

02



## దేవాలయాలపై రాజకీయాలు మానుకోవాలి

### శారదాపీఠం సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

### బుల్డోజర్ ప్రభుత్వం కాదు.. ప్రజల అనుకూల ప్రభుత్వం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** కోకాపేట శారదా పీఠం భూములు విషయంలో తప్పుడు సమాచారాన్ని గుర్తించి తిరిగి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారని, దేవాలయాల విషయంలో రాజకీయాలు తగవని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కోకాపేట్ శారదా పీఠానికి వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు మీడియా తో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలని గౌరవిస్తుందని స్వయంగా ప్రత్యేక పూజలతో అమ్మవారిని దర్శించుకున్నానని తెలిపారు. దేవాలయం వద్ద రాజకీయాలు చేయడం మానుకోవాలని, సమస్య వచ్చినప్పుడు పరిశీలించడం తెలుసుకోవాలన్నారు. బిజెపి బిఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం సబబు కాదన్నారు. కోకాపేట శారదా పీఠం భూమలు ఎటువంటి అపోహలకు తావులేకుండా కచ్చితంగా 100శాతం వారికే చెందుతాయని శ్రీధర్ బాబు అన్నారు. ఆదే విదంగా హైడ్రాకి సంబంధించిన మూసి పరివాహక ప్రాంతంలో కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దానిపై కూడా ప్రజలకు అనుకూలంగానే నిర్ణయం తీసుకుంటామన్నారు. బుల్డోజర్ ప్రభుత్వమని ప్రతిపక్ష నాయకులు అనడం సరికాదని, తమది ప్రజల వద్ద నిలబడి సమస్య పరిశీలించే ప్రభుత్వమని శ్రీధర్ బాబు అన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివాహ ఆహ్వానం

వివరాలు 3లో

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నటి రష్మిక

తమ వివాహ రిసెప్షన్ కు రావాలని ఆహ్వానం


వివరాలు 3లో

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన భట్టి విక్రమార్క

కొడుకు వివాహానికి రావాలని ఆహ్వానం

వివరాలు 3లో

# ఖమేనీ హతం



**మహా నెట్ వర్క్:** ఇరాన్ సుప్రీం లీడర్ 86 ఏళ్ల అయతుల్లా అలీ ఖమేనీ ఇక లేరు. అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాల సంయుక్త దాడిలో ఆయన చనిపోగా ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం ఉదయం ధ్రువీకరించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ కుమార్తె, మనవడు, కోడలు, అల్లుడు మరణించినట్లు పేర్కొంది. అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన సైనిక ఆపరేషన్‌లో ఖమేనీ హతమైనట్లు మొట్టమొదట ట్రంప్ తన ట్రూత్ సోషల్ ద్వారా ప్రకటించారు. "చరిత్రలోనే అత్యంత క్రూరమైన వ్యక్తుల్లో ఒకడైన ఖమేనీ మరణించాడు. ఇది కేవలం ఇరాన్ ప్రజలకే కాదు, ఖమేనీ, అతని రౌడీ మూకల చేతిలో ప్రాణాలు కోల్పోయిన లేదా వికలాంగులైన గొప్ప అమెరికన్లకు, అలాగే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రజలకు దక్కిన న్యాయం. అతను మా నిఘా వర్గాల నుంచి, అత్యంత అధునాతన ట్రాకింగ్ వ్యవస్థల నుంచి తప్పించుకోలేకపోయాడు. ఇజ్రాయెల్‌తో కలిసి మేము చేసిన ఈ ఆపరేషన్‌లో ఖమేనీ, అతని అనుచరులు తప్పించుకోలేకపోయారు. ఇరాన్ ప్రజలు తమ దేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశం" అని ట్రంప్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రభుత్వ మద్దతుదారులు విషాదంలో కూరుకుపోగా, మరికొన్ని చోట్ల సంబరాలు చేసుకుంటున్నారు. ఖమేనీ మద్దతుదారులు వ్యక్తిగతంగా సంతాపం ప్రకటిస్తున్నారు. ఖమేనీ మరణ వార్త తెలియగానే ఇరాన్‌లోని ప్రధాన నగరాల్లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్ యువరాజు రెజా కూడా స్పందించారు. ఖమేనీ పాలన ముగిసిందంటూ పోస్ట్ చేశారు. ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ 27 అమెరికాస్థావరాలపై, ఇజ్రాయెల్ పై అమెరికా మిత్రదేశాలపై దాడులు చేస్తోంది. దీంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన ఖమేనీ, అంచెలంచెలుగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. సాధారణ షియా మత ప్రబోధకుడిగా ఆయన కెరీర్ మొదలైంది. ఇరాన్‌లో రాజు మహ్మద్ రజా షా పహల్వీ పాలన జరుగుతుండగానే రహస్యంగా ఇస్లామిక్ విప్లవానికి క్షేత్రస్థాయిలో పునాదులు వేసిన కీలక వ్యక్తుల్లో ఖమేనీ ఒకరు. 1979 ఫిబ్రవరిలో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చాక, రాజు పాలన అంతమైంది. ఆ తర్వాత అయతుల్లా అలీ ఖమేనీ సుప్రీం లీడర్ అవకాశాన్ని చేజిక్కించుకుని ఇరాన్ ను గుప్పిట పట్టడంతో పాటు అనేక అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతూ మూడుదశాబ్దాలుగా ఎదురులేని నేతగా ఉన్నాడు.

## సామాన్య కుటుంబంలో పుట్టి...

ఇరాన్‌లోని మషద్ పట్టణంలో 1939 ఏప్రిల్ 19న అయతుల్లా అలీ ఖమేనీ జన్మించారు. ఆయన తండ్రి సయ్యద్ జవాద్ ఖమేనీ(1895–1986) కూడా మత ప్రబోధకుడే. 11 ఏళ్ల వయసులో అలీ ఖమేనీ మదర్సాకు వెళ్లి మత విద్యను అభ్యసించడం మొదలుపెట్టారు. 1950వ దశకం చివరినాళ్లలో మతపరమైన ఉన్నత విద్య కోసం సొంతూరు మషద్ నుంచి ఖోమ్ సిటీకి అలీ ఖమేనీ వెళ్లారు. ఈ ప్రయాణం ఆయన జీవితాన్ని మార్చేస్తుంది. ఖోమ్ సిటీలో ఖమేనీ కలిసిన విశిష్ట వ్యక్తి పేరు అయతుల్లా రూహుల్లా ఖమేనీ. ఇరాన్ తొలి సుప్రీం లీడర్ అయింది ఆయనే. రూహుల్లా ఖమేనీ దగ్గర మతపరమైన విద్యను అలీ ఖమేనీ అభ్యసిస్తారు. ఆయనకు బాగా సన్నిహితం అవుతారు. రూహుల్లా ఖమేనీ గొప్ప శిష్యులలో ఒకరిగా అలీ ఖమేనీ పేరు ఫేమస్ అవుతుంది.

## ఇస్లామిక్ విప్లవంలో సాధారణ కార్యకర్తగా ప్రస్థానం...

1960 - 1979 మధ్యకాలంలో ఇరాన్ రాజు మహ్మద్ రజా షా పహల్వీకి వ్యతిరేకంగా తిరుగుబాటుకు బీజాలు పడింది ఖోమ్ సిటీలోనే. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవాన్ని తేవాలనే బలమైన పట్టుదలతో రూహుల్లా ఖమేనీ శ్రమించారు. ప్రజలను చైతన్యవంతం చేశారు. ఇజ్రాయెల్, అమెరికా లాంటి దేశాలకు ఇరాన్ రాజు తొత్తులా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించేవారు. దీంతో రాజుకు వ్యతిరేకంగా ఇరాన్‌లో నిరసనలు పెరగసాగాయి. ఈ నిరసనల్లో ఒక సాధారణ కార్యకర్తలా అలీ ఖమేనీ పాల్గొనేవారు. ఇస్లామిక్ విప్లవం, రాజు అరాచక పాలనతో ముడిపడిన కరపత్రాలను అందరికీ పంపిణీ చేసేవారు. సభలు, సమావేశాల్లో ప్రసంగాలు ఇచ్చేవారు. ఈక్రమంలో చాలాసార్లు ఆయతుల్లా అలీ ఖమేనీ అరెస్టయి జైలుకు వెళ్లారు.

## ఇరాన్ రహస్య విప్లవ మండలి సభ్యుడు

అయతుల్లా రూహుల్లా ఖమేనీని ఇరాన్ రాజు మహ్మద్ రజా షా పహల్వీ తన శత్రువుగా భావించాడు. ఇరాన్‌లో నిరసనలను ఆపేందుకు రూహుల్లా ఖమేనీని అరెస్టు చేసి 19641965లో టర్కీకి, 19651978లో ఇరాక్‌కు, 1978 1979లో ఫ్రాన్స్‌కు ప్రవాసానికి పంపాడు. ఈ వ్యవధిలోనే రూహుల్లా ఖమేనీ కీలక శిష్యుడైన అలీ ఖమేనీకి ఫాలోయింగ్ భారీగా పెరిగింది. రూహుల్లా ఖమేనీ కీలకమైన మనిషిగా ఆయనకు పేరొచ్చింది. 1979 ఫిబ్రవరిలో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చాక ఈ ఇమేజ్ అలీ ఖమేనీకి పనికొచ్చింది. ఇరాన్ తొలి సుప్రీం లీడర్‌గా రూహుల్లా ఖమేనీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన తన శిష్యుడైన అలీ ఖమేనీకి కీలక పదవిని కేటాయించారు. ఇరాన్ రహస్య విప్లవ మండలి సభ్యుడిగా నియమించారు.

## వివాదాస్పద రీతిలో ఖమేనీకి సుప్రీం లీడర్ పదవి

1981లో ఇరాన్‌లో జరిగిన ఎన్నికల్లో దేశ అధ్యక్షుడిగా అయతుల్లా అలీ ఖమేనీ ఎన్నికయ్యారు. అదే ఏడాది కొందరు ప్రత్యర్థులు చేసిన ఎటాక్‌లో ఖమేనీ కుడి చేయిలోని రక్తనాళాలు దెబ్బతిన్నాయి. దీంతో అది పక్షవాతం బారినపడింది. 1989 వరకు ఇరాన్ అధ్యక్షుడిగా ఆయనే కొనసాగారు. ఆ సమయానికి ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్న అయతుల్లా రూహుల్లా ఖమేనీ వయసు 89 ఏళ్లు. రూహుల్లా ఖమేనీ 1989 జూన్ 3న గుండెపోటుతో చనిపోయారు. రూహుల్లా ఖమేనీ జీవించి ఉండగా, కీలకమైన వీలునామా రాస్తారు. తన తదుపరి ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతుల్లా హుస్సేన్ అలీ ముంతజరీని నియమించాలని సూచిస్తారు. రూహుల్లా ఖమేనీ చనిపోయే సమయానికి ఇరాన్ డిప్యూటీ సుప్రీం లీడర్ పదవిలో అయతుల్లా హుస్సేన్ అలీ ముంతజరీ ఉంటారు. అయితే అలీ ఖమేనీ దేశ అధ్యక్షుడిగా తన పవర్‌ను ఉపయోగించి, ఆ పదవి నుంచి హుస్సేన్ అలీ ముంతజరీని తప్పించి ఏళ్ల తరబడి హౌజ్ అరెస్టులో ఉంచుతారు. ఈవిధంగా 1989లో ఇరాన్ సుప్రీం లీడర్ పదవిని అయతుల్లా అలీ ఖమేనీ దక్కించుకుంటారు.

## ఐఆర్‌జీసీతో అరాచకం

1989 నుంచి ఇప్పటివరకు దాదాపు 36 ఏళ్ల 6 నెలల పాటు ఇరాన్ సుప్రీం లీడర్‌గా అలీ ఖమేనీ కొనసాగారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఇంత సుదీర్ఘకాలం పాటు పాలనను కొనసాగించిన ఏకైక పాలకుడు ఆయనే. సుప్రీం లీడర్ అయ్యాక ఇరాన్‌ను సైనికంగా బలోపేతం చేయడంపై ఖమేనీ పూర్తి ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)ను ఏర్పాటు చేశారు. ఇది నేరుగా ఖమేనీ వ్యక్తిగత నియంత్రణలోనే పనిచేసేది. ఒకవేళ తనకు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటు జరిగినా, ఎదుర్కొనే అస్త్రంగా ఐఆర్‌జీసీని ఆయన మలుచుకున్నారు. అంతేకాదు, ఇరాన్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు నిధులను అందించే సంస్థలను కూడా ఐఆర్‌జీసీ పర్యవేక్షణలోనే ఉంచారు. ఒక రకంగా చెప్పాలంటే మతం మాటున సైనిక పాలనను ఆయతుల్లా అలీ ఖమేనీ సాగించారు. అందువల్లే ఆయన ఎదురు లేకుండా 36 ఏళ్లపాటు సుప్రీం లీడర్ పదవిలో కొనసాగగలిగారు.

## ఇతర దేశాల్లో ఉగ్రవాదం పెంచి...

ఖమేనీ ఇరాన్‌తో సరిపెట్టుకోలేదు. తన ఐఆర్‌జీసీ దళాల ప్రభావాన్ని మిడిల్ ఈస్ట్‌లోని లెబనాన్, గాజా, ఇరాక్, యెమన్, సిరియాలకు విస్తరించారు. ఐఆర్‌జీసీ ద్వారా అక్కడి షియా మిలిటెంట్లకు ఆయుధాలు, డబ్బును చేరవేశారు. వాళ్లను ఇరాన్‌కు తీసుకొచ్చి సైనిక శిక్షణను అందించారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి తయారీ పనులను నేర్పించారు. ఫలితంగా లెబనాన్‌లో హిజ్బుల్లా, ఇరాక్‌లో ఖతాయబ్ హిజ్బుల్లా, గాజాలో హమాస్, యెమన్‌లో హూతీ అనే మిలిటెంట్ సంస్థలు పురుడుపోసుకున్నాయి. వీటివల్ల ఎక్కువగా ఇబ్బందిపడింది ఇజ్రాయెలే.

## ఎదిరించినవారిని బెదిరించి

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి తొలిసారిగా 1997లో పెద్ద రాజకీయ సవాల్ ఎదురైంది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో షియా మత ప్రబోధకుడు మహ్మద్ ఖతామీ ఇరాన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చాలా సామాజిక సంస్కరణలను ఖతామీ అమల్లోకి తెచ్చారు. ఈక్రమంలో మరిన్ని సంస్కరణలను కోరుతూ ఇరాన్ ప్రజలు ఉద్యమాలు మొదలుపెట్టారు. వాటికి సానుకూలంగా ఇరాన్ అధ్యక్షుడు మహ్మద్ ఖతామీ స్పందించసాగారు. ఖతామీ వైఖరిని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ వ్యతిరేకించారు. ఐఆర్‌జీసీ దళాలను ఉపయోగించి నిరసనకారులపై ఉక్కుపాదాన్ని మోపారు. మరోవైపు మహ్మద్ ఖతామీ వరుసగా రెండోసారి కూడా ఇరాన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2005 ఆగస్టు 3 వరకు ఈ పదవిలో ఆయన కొనసాగారు. ఇరాన్‌లోని మరిన్ని సామాజిక సంస్కరణలు జరగాలని మహ్మద్ ఖతామీ బహిరంగంగానే చెబుతుండేవారు.

## అహ్మదీ నెజాద్ vs ఖమేనీ

మహ్మద్ ఖతామీ అనంతరం ఇరాన్ అధ్యక్షుడిగా ఎన్నికైన అహ్మదీ నెజాద్ కూడా స్వతంత్రంగా పనిచేసే ప్రయత్నం చేశారు. ఇరాన్ నిఘా విభాగం తన కంట్రోల్‌లో ఉండాలని ఆయన వాదించారు. అప్పట్లో హైదర్ మస్లేహీ అనే వ్యక్తిని ఇరాన్ నిఘా విభాగం మంత్రిగా సుప్రీం లీడర్ ఖమేనీ నియమిస్తారు. అయితే ఖమేనీని సంప్రదించకుండానే, హైదర్ మస్లేహీని ఆ పదవి నుంచి అహ్మదీ నెజాద్ తప్పిస్తారు. దీంతో వెంటనే ఆ పదవిలో మళ్లీ హైదర్ మస్లేహీని నియమిస్తూ ఖమేనీ ఆదేశాలు జారీ చేస్తారు. ఇందుకు నిరసనగా 11 రోజుల పాటు అధ్యక్ష కార్యాలయానికి వెళ్లకుండా ఇంట్లోనే అహ్మదీ నెజాద్ ఉండిపోతారు. 2017, 2021, 2024 దేశ అధ్యక్ష ఎన్నికల్లో అహ్మదీ నెజాద్‌కు పోటీ చేసే అనుమతిని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఇవ్వకపోవడం గమనార్హం.

## ఇరాక్‌లోకి ఇరాన్ ఎంట్రీ...

2003లో ఇరాన్ పొరుగునే ఉన్న ఇరాక్‌పై అమెరికా దాడులు చేస్తుంది. దీంతో అక్కడి సద్దాం హుస్సేన్ ప్రభుత్వం కూలిపోతుంది. ఇరాక్‌లో సున్నీ ముస్లింలు సింహభాగం ఉంటారు. అక్కడి మైనారిటీ షియా వర్గం వారిని చేరదీసి మిలిటెంట్ గ్రూపులను ఏర్పాటు చేయమని ఐఆర్‌జీసీకి ఇరాన్ సుప్రీం లీడర్ ఆదేశాలిస్తారు. ఐఆర్‌జీసీ అనుబంధ విభాగం ఖుద్స్ ఫోర్స్‌కు చెందిన అధికారులు ఇరాక్‌కు వెళ్లి ఈ పనులన్నీ చేస్తారు. చివరకు ఖతాయబ్ హిజ్బుల్లా అనే మిలిటెంట్ సంస్థను అక్కడ ఏర్పాటుచేస్తారు. ఇప్పటికీ ఇది ఇరాన్‌ఇరాక్ సరిహద్దుల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. దీనికి ఆయుధాలు, నిధులను ఇరాన్ సర్కారే అందిస్తోంది. ఇరాక్‌లో అమెరికాకు సైనిక స్థావరం ఉంది. గత కొన్నేళ్లలో దానిపై ఖతాయబ్ హిజ్బుల్లా చేసిన దాడుల్లో డజన్ల కొద్దీ అమెరికా సైనికులు చనిపోయారు.



## ఖమేనీ అణ్వస్త్ర స్వప్నంపై ట్రంప్ పదేళ్ళ యుద్ధం

1957లో ఇరాన్ రాజుగా మహ్మద్ రజా షా పహల్వీ ఉన్న టైంలో అమెరికా నుంచి ఇరాన్‌కు న్యూక్లియర్ టెక్నాలజీ అందింది. 1970 నాటికే ఇరాన్‌లో 23 న్యూక్లియర్ పవర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. 1989లో ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్ అయ్యాక, ఈ న్యూక్లియర్ ప్లాంట్లను అణుబాంబుల తయారీ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించారు. ఇందుకోసం చైనా, పాకిస్థాన్, రష్యా లాంటి దేశాల సాయాన్ని కోరారు. చివరకు పాకిస్థాన్ నుంచి కొంత టెక్నాలజీని, సెంట్రీ ఫ్యూజ్‌లను సేకరించి యురేనియాన్ని శుద్ధి చేసే ప్రక్రియను చేపట్టారు. విద్యుత్ తయారీ అవసరాల కోసం తమ నుంచి తీసుకున్న న్యూక్లియర్ టెక్నాలజీతో అణుబాంబులు తయారు చేయకూడదని అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ 2016 నుంచే బలంగా వాదిస్తున్నారు. 2019లో ఆయన ఇరాన్‌పై తీవ్రమైన ఆంక్షలను ప్రకటించారు. అయినా ఇరాన్‌లోని న్యూక్లియర్ ప్లాంట్లలో యురేనియం శుద్ధి ప్రక్రియ ఆగలేదు. ఈనేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ లక్ష్యంగా 2026 ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ప్రత్యేక సైనిక చర్యను నిర్వహించాయి. ఇందులో ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు.

# పశ్చిమాసియాలో మారణహోమం



**మహా :** సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ భీకర దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌లో ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో 8 మంది మృతి చెందగా దాదాపు 20 మంది గాయపడినట్టు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ చాలా వరకు క్షిపణులను సమర్థంగా కూల్చినప్పటికీ కొన్ని తప్పించుకుని పలు భవనాలను తగిలినట్టు తెలుస్తోంది. ఈ దాడుల కోసం ఇరాన్ తొలిసారి హైపర్ సోనిక్ క్షిపణిని వాడినట్టు సమాచారం. మరోవైపు 4 బాలిస్టిక్ క్షిపణులతో అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ లక్ష్యంగా చేసుకుంది. హోర్ముజ్ జలసంధిపై నౌకలను సైతం ఇరాన్ లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోంది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలలోని బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ విరుచుకుపడుతోంది. దుబాయ్, అబుదాబి, సౌదీ అరేబియా, దోహా, మనామాపై కూడా దాడులు చేస్తోంది. ఇరాన్ దాడుల్లో అబుదాబిలో ఒకరు మరణించగా, దుబాయ్‌లోని ప్రసిద్ధ బుర్జ్ అల్ అరబ్ హోటల్ ముఖభాగం దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. ఈ దాడులపై యూఏఈ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇరాన్ దాడులు చేయాల్సింది పొరుగు దేశాలపై కాదని పేర్కొంది. ఇరాన్ దాడి ప్రారంభమైనప్పటి నుంచి తమ వైమానిక దళం ఇప్పటివరకు 165 బాలిస్టిక్ క్షిపణులు, రెండు క్రూయిజ్ క్షిపణులు 541 డ్రోన్లను అడ్డుకున్నట్టు యూఏఈ తెలిపింది. ఖమేనీ మృతికి కచ్చితంగా ప్రతీకారం ఉంటుందని ఇప్పటికే హెచ్చరించిన ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ అమెరికా, ఇజ్రాయెల్ బేస్‌లపై దాడులు చేస్తోంది. ఈ క్రమంలోనే దాడులను తీవ్రతరం చేసింది. మిడిల్ ఈస్ట్‌లోని 27 అమెరికా స్థావరాలపై దాడులు చేస్తున్నట్లు ఇరాన్ సైన్యం తెలిపింది. ఇరాన్‌పై దాడి చేసినందుకు శిక్ష తప్పదని తేల్చిచెప్పింది. ఇరాన్ దాడులతో బహ్రెయిన్, కువైట్‌లలో సైరన్లు మోగుతున్నాయి.

# గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు

(మొదటిపేజీ తరువాయి)

అక్కడి తెలుగువారు భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే హెచ్చరికలు, భద్రతా సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని పౌరులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు రాష్ట్ర యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్కడి ఎంబసీలతో టచ్‌లో ఉండాలని అధికారులను ఆదేశించారు.

**ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరా**

బహ్రెయిన్‌లోని తెలుగువారి భద్రతపై ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరా తీశారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో ఆందోళన నెలకొంది. అక్కడ సుమారు 50 వేల మంది ఏపీ వాసులు ఉపాధి పొందుతుండగా, వారిలో అయ్యన్న సొంత నియోజకవర్గమైన నర్సీపట్నం వారే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో అక్కడి తెలుగువారితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్.. ధైర్యంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా సాయం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అయ్యన్న తెలిపారు. పరిస్థితి విషమిస్తే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మాట్లాడి.. తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

# 444 భారత విమానాలు రద్దు



**ఢిల్లీ, మహా:** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇరాన్, మరికొన్ని దేశాల గగనతలాన్ని మూసివేయడంతో విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ క్రమంలో మార్చి 1న 444 విమానాలు రద్దయ్యాయని, ఇది ఇంకా పెరగవచ్చని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వెల్లడించింది. ఇదే కారణంతో ఫిబ్రవరి 28న దేశీయ విమానయాన సంస్థలకు చెందిన 410 సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, విమానాల మళ్లింపును సమర్థంగా నిర్వహించేందుకు ప్రధాన విమానాశ్రయాలను అప్రమత్తం చేసినట్టు డీజీసీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు సహాయం అందించడం, టెర్మినల్స్‌లో రద్దీని నియంత్రించడం వంటి చర్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొంది. మరోవైపు, కేంద్ర పౌరవిమానయాన శాఖ ఏర్పాటు చేసిన ప్యాసింజర్ అసిస్టెన్స్ కంట్రోల్ రూమ్ (పీఏసీఆర్) ప్రయాణికుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది.

**యుఏఈపై డ్రోన్ల దాడి**

యూఏఈపై ఇరాన్ మొత్తం 137 బాలిస్టిక్ క్షిపణులు, 209 డ్రోన్లతో దాడి చేసిందని, వాటిలో చాలా వరకు విజయవంతంగా అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 132 క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేయగా, 195 డ్రోన్లను కూల్చివేసినట్టు తెలిపింది. మిగిలినవి సముద్రంలో, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పడ్డాయని పేర్కొంది. ఈ దాడుల శిథిలాలు అబుదాబి, దుబాయ్‌లలో పడటంతో నష్టం వాటిల్లింది. అబుదాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను అడ్డుకునే క్రమంలో దాని శకలాలు కిందపడి ఆసియా దేశానికి చెందిన ఒకరు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు. దుబాయ్‌లోని పామ్ జుమేరా ప్రాంతంలో ఓ భవనంపై క్షిపణి శిథిలాలు పడటంతో నలుగురు గాయపడ్డారు. ఈ దాడుల వల్ల విమాన రాకపోకలకు అంతరాయం కలిగి, సుమారు 20,200 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అధికారులు తెలిపారు.

# ఇజ్రాయెల్, పాకిస్థాన్ పక్క దేశాలను బతకనివ్వవు

## ఖమేనీ హత్య అన్యాయం.. ఓవైసీ ఫైర్

**హైదరాబాద్, మహా:** ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది పూర్తిగా అనైతికమని, చట్టవిరుద్ధమైన చర్య అని మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులకు దిగడాన్ని ఆయన తప్పుబట్టారు. ఖమేనీని తమ నాయకుడిగా భావించే షియా ముస్లింలకు ఆయన తన పార్టీ తరపున సానుభూతి తెలిపారు. జెనీవాలో ఇరాన్‌అమెరికా మధ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే ఈ దాడులు జరగడం దురదృష్టకరమని ఒవైసీ అన్నారు. "చర్చలు సఫలమైతే అణ్వాయుధాల విషయంలో ఇరాన్ సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉండేది. కానీ, పవిత్ర రంజాన్ మాసం అని కూడా చూడకుండా ట్రంప్, నెతన్యాహు దాడులకు తెగబడ్డారు. నెతన్యాహుకు అసలు మానవత్వమే లేదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై జరిగిన దాడుల్లో 200 మందికి పైగా చనిపోయారని, ముఖ్యంగా ఒక బాలికల పాఠశాల ధ్వంసమై 108 మంది విద్యార్థినులు ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందన్నారు. ఇజ్రాయెల్ తీరును పాకిస్థాన్‌తో పోల్చిన అసదుద్దీన్.. ఈ రెండు దేశాలు ఆక్రమణదారులని, తమ పొరుగు దేశాలను ప్రశాంతంగా ఉండనివ్వడం లేదని విమర్శించారు. ఇజ్రాయెల్ ఇరాన్‌పై, పాకిస్థాన్ ఆఫ్ఘనిస్థాన్‌పై చేస్తున్న దాడులే ఇందుకు నిదర్శనమని అన్నారు. నెతన్యాహు పాలనలో పాలస్తీనాలో 70 వేల మంది ఊచకోతకు గురయ్యారని ధ్వజమెత్తారు. ట్రంప్, నెతన్యాహు భావిస్తున్నట్లు ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు జరగదని ఆయన స్పష్టం చేశారు. యుద్ధాన్ని ఆపడానికి భారత్ తన వంతు పాత్ర పోషించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. "గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు పనిచేస్తున్నారు. ఒమన్ పోర్టులో జరిగిన దాడిలో ఇప్పటికే కొందరు భారత కార్మికులు గాయపడినట్లు సమాచారం ఉంది. ఉమ్రా కోసం వెళ్లిన వారు విమానాలు రద్దై, డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఖమేనీ హత్యను ఖండించి, ఈ యుద్ధాన్ని ఆపడానికి కృషి చేయాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. యుద్ధం ఆగకపోతే ఆ ప్రాంతమంతా అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు.

# నేడు తెలంగాణకు రాహుల్ గాంధీ

## రాష్ట్రంలో ఏడు గంటలు .. రాజ్యసభ సభ్యుల ఎంపిక కొలిక్కి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్‌లో నూతనోత్సాహం నింపేందుకు ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం రాష్ట్రానికి రానున్నారు. వికారాబాద్‌లో జరిగే డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఉదయం 9:20 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుంటారు. ఉదయం 10:30 గంటలకు వికారాబాద్ చేరుకుని, అక్కడి హరిత హోటల్‌లో జరిగే శిక్షణ తరగతులకు హాజరవుతారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 వరకు రోజంతా డీసీసీ అధ్యక్షులు, పార్టీ కీలక నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 5:00 గంటలకు తిరిగి శంషాబాద్ చేరుకుని, అక్కడి నుంచి ఢిల్లీకి ప్రయాణమవుతారు. కాగా పలువురు మాజీ మావోయిస్టు నేతలు రాహుల్‌ను కలిసే అవకాశముంది.

**రాజ్యసభ సభ్యుల ఎంపిక**

రాహుల్ గాంధీ పర్యటనలో కేవలం శిక్షణ తరగతులకే పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన కొన్ని అంశాలపై కూడా దృష్టి సారించనున్నారు. తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై రాహుల్ గాంధీ ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సామాజిక సమీకరణాలు, పార్టీ విధేయత ప్రాతిపదికన పేర్లను ఖరారు చేసే ఛాన్స్ ఉంది. వంశీచంద్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, వీహెచ్, ఫహీం ఖురేషీ, రంజిత్ రెడ్డి, మధుయాస్కీ గౌడ్, కుసుమకుమార్ తదితరులు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నటి రష్మిక

## తమ వివాహ రిసెప్షన్ కు రావాలని ఆహ్వానం



**హైదరాబాద్, మహా :** కొత్త పెళ్లికూతురు రష్మిక మందన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండతో ఏడడుగులు వేసిన రష్మిక, సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎం కుటుంబ సభ్యులతో ఆమె కాసేపు ఆప్యాయంగా గడిపారు. తమ వివాహ రిసెప్షన్ కు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ విషయాన్ని రష్మిక స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆయన అర్ధాంగి గీత, ఆయన కుమార్తె నైమిషలను కలవడం చాలా సంతోషంగా ఉందని రష్మిక పేర్కొన్నారు.ఈ కలయికలో సీఎం అర్ధాంగి గీత, రష్మికకు ఒక ప్రత్యేక బహుమతిని అందజేశారు. ఆ గిఫ్ట్ పట్ల మురిసిపోయిన రష్మిక, ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని కలిసి తమ కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్ అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీసమేతంగా వచ్చి వారి కుమారుడి వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కుటుంబసమేతంగా రావాలని ఆదివారం ఆహ్వానించారు.

# ఆందోళనల ఫలితమే..



- **బయ్యారం క్రాస్ రోడ్ వరకు మరమ్మతులు..**
- **సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్ రెడ్డి..**

**మణుగూరు,, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు నుంచి ఇ బయ్యారం క్రాస్ రోడ్ వరకు రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఆందోళనల ఫలితంగానే మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. రోడ్డు మరమ్మతులు ప్రారంభం కావడం హర్షించదగ్గ విషయమన్నారు.రహదారి దుస్థితి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా దుమ్ము, ధూళి సమస్యతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి దుమ్ము నివారణ చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలను కలుపుకొని ఆందోళనలు నిర్వహించామని చెప్పారు. అలాగే సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరామని తెలిపారు. ఈ సమస్యపై స్థానిక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లును కలిసి విన్నవించగా, ఆయన వెంటనే స్పందించి అధికారులను ఆదేశించడంతో రోడ్డు మరమ్మతులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. మరమ్మతుల వలన ప్రజలకు దుమ్ము, ధూళి నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారానికి సహకరించిన అఖిలపక్ష నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఉపరితల ఖాళీల భర్తీ ప్రకటనపై హర్షం

**డిప్యూటేషన్ ప్రాతిపదిక నియామకాలతో కార్మికులకు లాభం.. : టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి..**




**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియా పరిధిలోని ఉపరితల విభాగంలో జనరల్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్ ఖాళీలను గుర్తించి వాటిని కొండాపురం అండర్‌గ్రౌండ్ కార్మికులతో డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయాలని స్థానిక యాజమాన్యం విడుదల చేసిన ప్రకటనపై ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఆసక్తి గల అండర్‌గ్రౌండ్ కార్మికుల నుంచి మార్చి 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు గడువు ఇవ్వడం సానుకూల నిర్ణయమని పేర్కొన్నారు.ఆదివారం పీవీ కాలనీలోని జయశంకర్ సార్ టిబిజికెయస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏరియాకు నిర్దేశించిన 114 లక్షల 90 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, కార్మికులు సమిష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఖాళీల భర్తీతో అండర్‌గ్రౌండ్ కార్మికులకు మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు కలగడంతో పాటు ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనకు ఇది దోహదపడుతుందని చెప్పారు. లక్ష్యాల సాధనలో అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ దిశానిర్దేశంతో అధికారులు, కార్మికులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా నివేదికలు రూపొందిస్తూ ఏరియా ప్రగతికి, కార్మిక సంక్షేమానికి ఆయన విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏరియాలో పెండింగ్‌లో ఉన్న సర్వే మజ్దూర్, డంప్ మెన్, ట్రిప్ మెన్, మ్యూచువల్ క్వార్టర్ కౌన్సిలింగ్‌లు, అండర్‌గ్రౌండ్ కార్మికులతో ఉపరితల ఖాళీల భర్తీ తదితర అంశాలపై టిబిజికెయస్ తరపున సంబంధిత అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందించామని, యాజమాన్యం సానుకూలంగా స్పందించి పరిష్కార మార్గం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఏరియా అధికార ప్రతినిధి రమేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే ఏరియాలో చైన్ మెన్, అసిస్టెంట్ చైన్ మెన్, చార్జర్ సేఫ్టీ ల్యాంప్ తదితర పెండింగ్ ఖాళీలను కూడా త్వరితగతిన భర్తీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, దిశెట్టి రమేష్, పి.కె. నాగరాజు, కమటం పరమేష్, బొద్దుల ప్రవీణ్ కుమార్, రాజ్ కుమార్, ఇజ్రాయిల్, మస్తాన్, సాంబార్ రాజశేఖర్, వినయ్ కుమార్ రమేష్ నాయక్, పద్దం శ్రీనివాస్, చిరుత వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.



# టెంకటి మలుసూరు సేవలు అభినందనీయం

- **ఆయన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి**
- **ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవంలో వక్తలుటెంకటి మలుసూరు నాగమణిలకు ఘన సన్మానం**

**సత్కారంభద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేయడంతో పాటు సామాజిక సేవలు అందిస్తూ ఇటు ఉపాధ్యాయులలో అటు ప్రజలలో మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు టెంకటి మలుసూరు అని ఆయన విద్యా వ్యవస్థకు అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్బులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు టెంకటి మలుసూరు ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాల్గొన్న పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు చక్కగా బోధన అందించి వారిని సక్రమ మార్గంలో నడిపించిన మలుసూరు కృషి మరువలేనిదన్నారు. విద్యాశాఖలలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన మలుసూరు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో మలుసూరు రాణించడమే కాకుండా జర్నలిజంలో కూడా సేవలందించారని పేర్కొన్నారు. అనంతరం టెంకటి మలుసూరు నాగమణిలకు ఘన సన్మానం సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాత్రికేయ మిత్రులు టెంకటి మలుసూరు నాగమణిల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
- **చర్లలో రూ.10.70 కోట్లతో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నూతనంగా జరగబోయే 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సుమారు 10 కోట్ల 70 లక్షల రూపాయల స్టేట్ గవర్నమెంట్ నిధులతో ఈ అత్యాధునిక ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. చర్ల మండలంలోని మారుమూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. వైద్యులు సిబ్బంది చేస్తున్న కృషి గర్వించదగ్గదని భవిష్యత్తులో ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా నాణ్యమైన చికిత్స అందించాలని మంత్రి ఈ సందర్భంగా వైద్యులకు సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ..ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేసిందని తెలిపారు. భవన నిర్మాణ పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన అత్యవసర వైద్య సేవలు స్థానికంగానే లభిస్తాయని ఆయన అన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ నూతన భవనం అందుబాటులోకి వస్తే స్థానిక గిరిజనులకు ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుందని ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తెలిపారు. శంకుస్థాపన అనంతరం ఆసుపత్రిలో అంకితభావంతో పనిచేస్తున్న వైద్యులను సిబ్బందిని మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా అభినందించారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వారు అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడుతూ వారికి ప్రభుత్వం తరపున ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, డి.సి.హెచ్.ఓ రవి బాబు, స్థానిక సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల కోతుల సమస్య కు పరిష్కారం....!

## 200 కోతుల ను పట్టించిన సర్పంచ్ సుజాత



**నేలకొండపల్లి, మహా:** గత 15 ఏళ్ల నుంచి కోతులతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య కు ప్రస్తుత సర్పంచ్ కోతుల ను పట్టించి సమస్య కు పరిష్కారం చూపారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి . మండలం లోని సుర్దేపల్లి లో కోతుల వలన మొక్కజొన్న, చెరుకు ఇతర పంటలను ధ్వంసం చేయటం... ఇళ్లలో మామిడి చెట్ల తో పాటు ఇతర తినే పండ్లు ను తెంపి వేయటం, ఇళ్లలో చోరబడి అన్నం కోసం ప్రజలను భయభ్రాంతుల కు గురి చేస్తున్నాయి. ప్రజల ఇబ్బందులను గమనించిన సర్పంచ్ గరిడేపల్లి సుజాత ఆదివారం కోతుల ను పట్టించారు. ఏపీ లోని తిరుపతి కి చెందిన కోతుల పట్టే ప్రత్యేక బృందం కోతుల వేట ను సాగించారు. ప్రత్యేకంగా చేయించిన బోను లో కోతుల ను పట్టారు. మొత్తం 200 కోతుల ను పట్టించి.. ఇల్లందు అటవీ ప్రాంతం కు తరలించారు. గ్రామంలో కోతుల సమస్య లేకుండా పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు 15 ఏళ్ల పడుతున్న ఇబ్బంది ని పరిష్కారం చేసిన సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గరిడేపల్లి రామారావు తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం...



**చర్ల మహా :** చర్లలో రూ. 10.70 కోట్లతో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపనచేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో ఆదివారం నాడు రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం నూతన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, తో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 10 కోట్ల 70 లక్షల రూపాయల స్టేట్ గవర్నమెంట్ ఫండ్ (TGMSIDC) నిధులతో ఈ అత్యాధునిక ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.శంకుస్థాపన అనంతరం ఆసుపత్రిలో అంకితభావంతో పనిచేస్తున్న వైద్యులను, సిబ్బందిని మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా అభినందించారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వారు అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడుతూ, వారికి ప్రభుత్వం తరపున ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, చర్ల మండలంలోని మారుమూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు . వైద్యులు, సిబ్బంది చేస్తున్న కృషి గర్వించదగ్గదని, భవిష్యత్తులో ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా నాణ్యమైన చికిత్స అందించాలని మంత్రి ఈ సందర్భంగా వైద్యులకు సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ .. ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేసిందని తెలిపారు. భవన నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన అత్యవసర వైద్య సేవలు స్థానికంగానే లభిస్తాయని ఆయన అన్నారు .ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ నూతన భవనం అందుబాటులోకి వస్తే స్థానిక గిరిజనులకు మరియు ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుందని ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తెలిపారు . ఈ కార్యక్రమంలో డి.సి.హెచ్.ఓ రవి బాబు, స్థానిక సర్పంచ్ పూజారి సామ్రాజ్యంఈ అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సెమీస్‌కు టీమిండియా

**కోల్ కతా:** టీ20 వరల్డ్‌కప్ సెమీ ఫైనల్‌కు భారత్ క్వాలిఫై అయింది. సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచులో 5 వికెట్ల తేడాతో గెలిచింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన డూ ఆర్ డై మ్యాచ్ లో టీమిండియా బంపర్ విక్టరీ సాధించింది. సూపర్ 8 గ్రూప్ 1లో జరుగుతున్న ఈ 52వ మ్యాచ్ లో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. వెస్టిండీస్ భారీ స్కోరు సాధించినా, లక్ష్యసాధనలో ఇండియా సక్సెస్ అయింది. 196 పరుగుల లక్ష్యాన్ని మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఓపెనర్ సంజూ శాంసన్ (97*) సూపర్ ఇన్నింగ్స్ ఆడారు. తిలక్ 27, హార్దిక్ 17 రన్స్ చేశారు. ఈ నెల 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగే సెమీ ఫైనల్ 2లో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి.

# రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం

(మొదటిపేజీ తరువాయి)

రెండేళ్లపాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్ మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని.. ఈ పోరాటంలో బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని చెప్పారు.

**రాహుల్ మౌనం**

ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తున్నదంటూ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతోపాటు మిగిలిన నేతలంతా చెబుతుంటే.. తెలంగాణలో జరుగుతున్న ఈ బుల్డోజర్ రాజ్యాన్ని దాని అరాచకాలను మాత్రం ఆపకుండా మౌనంగా ఎందుకు ఉంటున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇండ్లను కూలగొట్టడం, భూములు ఆక్రమించడం రియల్ ఎస్టేట్ దందా చేయడం, దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రజల ఇళ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే తన పనిగా పెట్టుకున్నారని అన్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఒక్క ప్రాజెక్టు గాని, ఒక్క ఇల్లు గాని, ఒక్క రోడ్డు గాని వేయకుండా కేవలం విధ్వంసమే తన విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ప్రజావాణికి అధికారులు హాజరు కావాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



# నిర్వాసితులకే పంటల ఫలం

## సీతారామ ప్రాజెక్టు నిర్వాసితులకు ఎమ్మెల్యే హామీ

**కారేపల్లి, మహా :** సీతారామ ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోతున్న రైతులు తాము వేసుకున్న పంట ఫలసాయం వారికే చెందేలా అధికారులుతో మాట్లాడతానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ నిర్వాసిత రైతులకు హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం అందించింది. పరిహారంలో రెండు పంటలకుసంబంధించి ఫలసాయం సైతం ఇచ్చామంటూ అధికారులు నిర్వాసిత రైతుల సూబాబుల్, జమాయిల్ తోటలను నరకనీయకుండా అధికారులే టెండర్లు లేకుండా ఫలసాయంను తరలిస్తున్నారు. దీనిపై నిర్వాసిత రైతులు చీమలపాడు సర్పంచ్ మాలోత్ లలితబావుసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను కలిసి ఫలసాయం రైతులకు చెందేలా చర్యలు తీసుకోలాని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టుకు సేకరించిన భూమిలో వేసిన పంటకు పరిహారం కింద ఇచ్చిన రూ. 1.38లక్షలు ఇస్తుందని ఇది పెట్టుబడికి మాత్రమే సరిపోతుందన్నారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 2-03-2026




# 'అ'

- బమ్మిడి జగదీశ్వరరావు

కథ

చిత్రమైన కేసు వొకటి వొచ్చింది, న్యాయస్థానానికి.

ఇటు 'న్యాయం' బోనెక్కింది. అటు 'అన్యాయం' బోనెక్కింది.

జడ్జిగారు తన యెదురుగా నిలబడ్డ న్యాయ అన్యాయాల్ని సమదృష్టితో చూశారు, అది తన విధి మరి. ఎవరి పట్లా యెక్కువ తక్కువలు లేవు.

'న్యాయం' నేను గొప్ప అంది.

'అన్యాయం' నేను గొప్ప అంది.

న్యాయస్థానంలో వాదనలు జరుగుతున్నాయి. 'న్యాయవాదులు'గా నల్లకోటు ధరించినవాళ్ళు తమ తమ బాధ్యతలను స్వీకరించారు. న్యాయం వైపు వొకరు. అన్యాయం వైపు వొకరు.

'న్యాయమూర్తి' అంటారు. 'న్యాయవాదులు' అంటారు. 'నాయస్థానం' అంటారు. అంచేత న్యాయమే గొప్పది అని 'న్యాయం' గర్వంగా చూసింది.

పేరులో గొప్ప వుండదు. తీర్పులో న్యాయం మాత్రమేవుండదు. న్యాయం అని మీరు భావించినదాన్ని అన్యాయం అని అవతలి అభ్యర్థి ఫీల్ కావచ్చు అని 'అన్యాయం' నైతిక విజయం తనదేనన్నట్టు చూసింది.

జడ్జిగారు జీవితకాలం తీర్పులు చెప్పీచెప్పీ అలసిపోయారో ఆసక్తిని కోల్పోయారో తెలీదు, అలవాటుగా వింటున్నారు.

న్యాయం సాక్ష్యాధారాలమీద ఆధారపడివుంటుంది. ఇంకా చెప్పాలంటే వాదనలమీద ఆధారపడి వుంటుంది. అందుకే జనం తమవైపు న్యాయం వుందిలే అని ధైర్యంగా వుండలేరు. తమవైపు 'బలమైన న్యాయవాది' వున్నారు అన్నప్పుడే ధైర్యంగా వుంటారు అంది 'అన్యాయం'.

'న్యాయం' న్యాయం కాదని అనలేకపోయింది.

'అన్యాయం' అక్కడితో ఆగలేదు. 'బలమైన న్యాయవాది' కావాలంటే డబ్బుండాలి. అధికారముండాలి. కులముండాలి. ఉంటే అన్యాయం న్యాయమవుతుంది. అలాంటి న్యాయానికి న్యాయమూ అన్యాయానికి అన్యాయమూ జరుగుతుంది అంది 'అన్యాయం'.

జడ్జిగారు చప్పుడు చెయ్యకుండా నిట్టూర్చారు.

ఒక న్యాయస్థానంలో న్యాయం గెలిచింది అని అనుకుంటే, ఆపై న్యాయస్థానం అంతవరకూ అన్యాయంగా తీసిపడేసిన వారికే విజయం ప్రకటించవచ్చు అంది 'అన్యాయం'.

ఒక కోర్టులో న్యాయం మరొక కోర్టులో అన్యాయంగా మారిపోవచ్చు తన అనుభవాల్ని తలచుకుంటూ అనుకున్నాడు జడ్జి.

సో... న్యాయ అన్యాయాలకు పెద్ద తేడా లేదు అంది 'అన్యాయం'.

న్యాయం యెంత బలహీనమైనదో అన్యాయం నవ్వే నవ్వు చెప్పకనే చెప్తోంది.

ఒకరికి న్యాయం జరిగితే మరొకరికి అన్యాయం జరిగినట్టు కాదు అంది 'న్యాయం'.

'కాదు' యెంత కరెక్టో 'అవును' కూడా అంతే కరెక్టు. ఒకరికి న్యాయం జరగడంలో మరొకరికి అన్యాయం జరగకుండా కూడా వుండదు అంది 'అన్యాయం'.

'న్యాయం'కు మాట రాలేదు.

న్యాయస్థానాలలో న్యాయం వొక్కటే దక్కితే, యింతమంది న్యాయమూర్తులూ న్యాయవాదులూ సిబ్బందీ వుండరు. దానికో శాఖా వుండదు. శాఖకో మినిస్టరూ వుండడు. ఇన్ని కేసులూ వుండవు. కేసుల మీద కేసులూ వుండవు చెప్పుకుపోతోంది 'అన్యాయం'.

'న్యాయం' అడ్డం పడింది. చాలా కాలం పట్టొచ్చు. కాని న్యాయం దక్కొచ్చు చెప్పడం పూర్తికాలేదు.

వా యి దా ల మీ ద వాయిదాలు పడడంవల్ల యేళ్ళతరబడి కొనసాగడంవల్ల న్యాయం జరిగినా అందులో న్యాయంకన్నా అన్యాయమే యెక్కువ. హింస తోడవుతుంది. అంటే శిక్ష కూడా. అంటే తీర్పుకు ముందే. అటూ యిటూ. నిజం చెప్పాలంటే న్యాయంలోనూ అన్యాయమే వుంది అంది 'అన్యాయం'.

'న్యాయం'కు నోట మాట రాలేదు. తన వైపు అంటే న్యాయం వైపు మాట్లాడుతూన్న అన్యాయంలోనూ న్యాయం వుందనిపించింది.

కోర్టులకు యెదురుచెప్పకూడదు. అలా చెప్పడం నేరం అంది 'న్యాయం'.

అంటే కోర్టు చెప్పిందే న్యాయం, అవునా? అంది 'అన్యాయం'.

న్యాయం తలాడించింది.

కోర్టు చెప్పిన న్యాయం అన్యాయం అనిపించినప్పుడు యేమవుతుంది? అడిగింది 'అన్యాయం'.

నువ్వే చెప్పన్నట్టు చూసింది న్యాయం.

అన్యాయంగా అన్యాయం జరిగిందని న్యాయం కోసం కోర్టు బయట కొట్లాటకు దిగుతారు, బలవంతంగా పొందాల్సిన న్యాయం పొందుతారు, నష్టపోయినా సరే... మూల్యం చెల్లించయినా సరే 'అన్యాయం' చెప్పడం పూర్తికాలేదు.

అప్పుడు న్యాయానికీ అన్యాయానికీ పెద్ద తేడా లేదుగా? అడిగింది న్యాయం.


నేను చెప్పేదీ అదే, నువ్వూ నేనూ వొకటే

## కవిత

నా కవిత
దానికి ఏమి కావాలో
నాకు నేర్పుతుంది
కిటికీ ఎలా తెరవాలో
తెరిచి ఏమి చూడాలో
చూసింది ఏమి చెప్పాలో
ఎలా చెప్పాలో
చెప్పిందల్లా చేస్తున్నట్టు
నన్ను తనవాడిని చేసుకుంటుంది

నిద్రపోనివ్వని నా రాత్రిని
వెలిగిస్తుంది
కవిత నా చేతుల్లో ఉండి
నా చేతులతోనేఅన్నీ రాయిస్తుంది

దాని అధీనం నుండి వైదొలగి
ఇదిరాసింది
నేనేనాఅంటే
నీకు తెలియనిది
నాకెలా తెలుస్తుందని
నాచేత రాయించింది
నాకే వదిలిజారుకుంటుంది



ముకుంద రామారావు
సెల్ : 9908347273

# అనువాదంలో పర్యాయపదాల పాత్ర

- ఎలగనాగ

అనువాదంలో భాషకు, వ్యాకరణానికి ప్రాముఖ్యం లేదని, అవి పూర్తిగా స్వతంత్రమైన (independent)అంశాలు అని భావించడం సబబు కాదు. సైగలను మినహాయిస్తే పదాలు, వాక్యాలు లేకుండా మనసులోనిఏ భావాన్నీ వ్యక్తీకరించడం సాధ్యం కాదు. భాష, వ్యాకరణం చాలా లోపభూయిష్ఠంగా ఉన్నప్పుడు మూలంలోని ఆత్మ (soul or spirit) అనువాదంలో సంతృప్తికరంగా ప్రతిబింబించడం కల్ల. భాష ప్రభావం అనువాదం మీద పరోక్షంగానైనా తప్పకుండా ఉంటుంది. వాస్తవానికి ప్రత్యక్షంగానే ఉంటుంది.

ప్రతి పదానికి రంగు, రుచి, బరువుఉంటాయి అన్నది గుర్తు పెట్టుకోతగిన విషయం. మూలంలోని పదాలకు, పదబంధాలకు సరిగ్గా అతికే (match అయ్యే)మాటలను స్వీకరించినప్పుడే న్యాయం చేసినవాళ్లమౌతాం. ఇక్కడే నిఘంటువులు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. సరిగ్గా అతికే పదం కొన్నిసార్లు (నా విషయంలో ఐతే చాలాసార్లు) తెలిసినదే అయినా సమయానికి గుర్తు రాదు. ఒక కవితను అనువదిస్తున్నప్పుడు 'అసహ్యించుకుంటాను'ను ఒక పంక్తిలో రాయాలనుకోండి. కానీ దానికి ముందరి పంక్తిలో అదే మాటను వాడి ఉంటే పునరావృతిని తప్పించుకోవాల నుకున్నప్పుడు, లేదా అసలు ఆ పదాన్ని పూర్తిగా మానుకోవాలనుకున్నప్పుడు అదే అర్థాన్నిచ్చే వేరే పదం అవసరమౌతుంది. అప్పుడు నిఘంటువులను సంప్రదిస్తే 'ఏవగించుకుంటాను' దొరుకుతుంది. అదేవిధంగా 'హఠాత్తుగా'ను లేదా 'అకస్మాత్తుగా'ను మానుకోవాలను కుంటాం. అప్పుడు నిఘంటువులను చూస్తే ఎకాయెకిన అనే పదం దొరుకుతుంది. ఈ రెండు మాటలు(ఏవగించుకోవడం, ఎకాయెకిన)మనకు తెలిసినవే అయివుంటాయి. కానీ సమయానికి గుర్తుకు రావు. కాబట్టి డిక్షనరీలు ఆ విధంగాఉపయోగపడతాయి. అంతే కాకుండా మూలంలోని పదానికి మరింత బాగా సరిపోయే ఎన్నో మాటలు నిఘంటువులలో ఉంటాయి. ఉదాహరణకు alliteration, end rhyme ల ప్రకారం పొసగేవి. సరైన మాటను నిర్ధారించుకున్న తర్వాత దాన్ని సరైన స్థానంలో పెడితేనే భావం ప్రభావవంతంగా, సాఫీగా వ్యక్తమవుతుంది. ఇక్కడే సింటాక్స్ (వాక్యనిర్మాణం)కు సంబంధించిన జ్ఞానం ఉపయోగపడుతుంది. సరైన స్థలంలో సరైన పదం కచ్చితమైన భావప్రసారాన్ని సాధించగలదు. వచన రచనలో దీని ప్రాధాన్యం మరింత ఎక్కువ.

మూలభాష, లక్ష్యభాషలలో ఏదైతే తమ మాతృభాష కాదో అదే అనువాదకులకు సవాలు విసురుతుంది. ఉదాహరణకు ఆంగ్లంనుండి తెలుగులోకి అనువదిస్తున్నప్పుడు, మూలకవి లేదా రచయిత ఏం చెబుతున్నాడో సరిగ్గా పట్టుకోవడమే కష్టమౌతుంది. మూలంలోని భావమే తెలియనప్పుడు ఇక కరెక్టు అనువాదం ఎలా చేయగలం? ఈ కింది రెండు ఉదాహరణలను గమనించండి.

సారా టీస్డేల్ కవితలోని రెండు పంక్తులు:

All things are changed, save in the east
The faithful beauty of the stars.

చెహోవ్ కథకు ఆంగ్లానువాదం లోంచి సగం పంక్తి :

When in the evening stillness he heard from his study the voices of his children,...

పైరెండు సందర్భాలలో save, studyల సాధారణ అర్థాలు కాకుండా వాటి అరుదైన అర్థాలు తెలిస్తేనే అనువాదంలో సరైన తెలుగు మాటలను వాడగలం. ఔత్సాహిక అనువాదకులు దీన్ని అభ్యాసం (exercise)గా భావించి ప్రయత్నం చేస్తారని ఆశిస్తూ జవాబులు చెప్పకుండా వదిలేస్తున్నాను. ఇది కొత్తవాళ్లకు మాత్రమే. ఇప్పటికే అనువాదాలు చేసి అనుభవం సంపాదించుకున్నవారికి అవసరం లేదు.

ఇంగ్లిష్, తెలుగు భాషలు బాగా వచ్చినా Equinox అనే ఆంగ్లకవితా శీర్షికను నిఘంటువుల సహాయం తీసుకోకుండా తెలుగులోకి అనువదించగలమా? దాని అర్థాన్ని వివరించినా సమానార్థకమైన ఏకపదశీర్షిక దొరకడం చాలా కష్టం. కానీ ప్రయత్నిస్తే దొరుకుతుంది. అది అందరికీ ఆమోదయోగ్యమైనదేనా కాదా అన్నది వేరే విషయం. అనువాదకులకు అసలు నిఘంటువులే అక్కర్లేదు అనేవాళ్లకు ఓ నమస్కారం. వాస్తవానికి ఒకటి కాదు, ఇంకా ఎక్కువ ఉండాలి. వాటిలో ఒకటి రెండైనా ప్రామాణికమైనవి ఉండటం అవసరం.

వేట ఇతివృత్తంగా గల కథలలో shot, game లకు వేటగాడు, అడవి జంతువు అని అర్థాలు చెప్పుకోవాలి. ఇక soul కు ఆత్మ అనే కాకుండా మనిషి అనే మరో అర్థం ఉంది. అంటే అది man కు పర్యాయపదంఅన్న మాట. There is not a single soul in the street అంటే వీధిలో ఒక్క మనిషి కూడా లేదు అని అర్థం. దీన్నే మంచి నుడికారాన్ని ఉపయోగించి చెప్పాలనుకుంటే మనిషికి బదులు 'పురుగు'ను వాడొచ్చు. కొన్నిసార్లు native speakersమాట్లాడే పదాల అర్థాలను పట్టుకోవడం కష్టం అవుతుంది. ఉదాహరణకు lodge, dinner లను వాళ్లు ఇల్లు, మధ్యాహ్న భోజనంకు పర్యాయ పదాలుగా వాడుతారు. ఆంగ్లభాష ప్రకారం డిన్నర్ అంటే రోజులోని అతిపెద్ద భోజనం. రాత్రిభోజనానికి supper సరైన పదం. కానీ మనం మాత్రం రాత్రిభోజనాన్ని డిన్నర్ అనే అంటున్నాం. ఈ వ్యాసరచయిత తన హైస్కూలు రోజుల్లో ఒక ఆంగ్లకథను అనువదించినప్పుడు royal delicacyని రాజ సౌకుమార్యం అనీ, ముప్పయ్యేళ్ల కింద catmint ను పిల్లిపుదీనా అనీ తర్జుమా చేశాడు! కానీ వాటికి సరైన తెలుగు మాటలు రాజుల తిండి, అడబీర. నిఘంటువులను సంప్రదించకుంటే ఈ పదాలు మనకు తెలియడం కష్టం. కొన్ని పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో మోటార్ సైకిల్ ను మెషీన్ అనీ, బాల్ పాయింట్ పెన్నును బైరో/బిరో అనీ అంటారు. ఒక్కరు కూడా మనం వాడే మోటార్ సైకిల్, బాల్ పాయింట్ పెన్ లాంటి మాటలను వాడరు. కాబట్టి వాటిని పట్టుకోవడం కష్టం అవుతుంది.

తినే అరటిపండును bananaఅనీ, కూరగా వండుకునేదాన్ని plantain అనీ అంటారని అనువాదకునికి తెలిస్తే అతడు తర్జుమాలో తప్పులు చేయడు. వేటగాడు వెంట తీసుకువెళ్లే dog ను, లేదా సైన్యం చేత శిక్షణ పొందినdog నులక్ష్యభాషలోకుక్క అనకుండా జాగిలం అంటే మరింత బాగా పొసగుతుందనితెలిస్తే అదనపు ప్రయోజనం (advantage) చేకూరుతుంది.

భావాన్ని గాలికి వదిలిపెట్టి కరెక్టు సమానార్థక పదాలను వాడినంత మాత్రాన అనువాదం పరిపూర్ణంగా ఉంటుందని అపోహ పడకూడదు. కొన్ని సందర్భాలలో మక్కీకి మక్కీగా రాసినప్పుడు ఆ అనువాదం నవ్వును తెప్పిస్తుందనటంలో సందేహం లేదు. తనకు పూర్తిగా కొత్తవి అయిన జాతీయాలు (idioms), మాండలిక పదాలు (dialect words or colloquialisms),యాస (slang)వచ్చినప్పుడు అక్కడ తను ముందుగా వాడిన పదం పొసగడం లేదని అనువాదకునికి అనుమానం రావాలి. ఈ'అనుమానం రావడం' చాలా చాలా ముఖ్యం. అది రాకపోతే ఇక అంతేసంగతులు! అది వచ్చింతర్వాత,ఓపికతో సరైన మాటకోసం బాగా వెతకాల్సి ఉంటుంది. అంటే ఆదరబాదరగా కాకుండా అవసరమైనంత సమయాన్నివెచ్చించాలన్న మాట. అనువాదంలో బాగా అనుభవం ఉన్నవాళ్లకు తక్కువ సమయం పట్టవచ్చు, అది వేరే సంగతి.

ఇలా ప్రతి పదం మీద, ప్రతి వాక్యం మీద ధ్యాస పెట్టి శ్రద్ధతో తర్జుమా చేస్తే మంచి ఫలితాలను పొందవచ్చు.

# తెలుగు సినీ చరిత్రకు కొత్త వెలుగు

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో సమాజాన్ని తమదైన బాధ్యతతో ప్రభావితం చేసిన సాహిత్యం, నాటక రంగం తర్వాత చెప్పుకోదగినది సినిమా రంగమే. కళల పట్ల తమకున్న ఆరాధన భావాన్ని, కలలను సాక్షాత్కరింప చేసుకోవడానికి యువతరానికి సినిమా రంగం ఆలంబనగా నిలిస్తే, దేశమాతకు దాస్య విముక్తి గావించి తన దేశభక్తిని చాటుకునేందుకు స్వాతంత్రోద్యమం ఊతమిచ్చింది. స్వాతంత్రోద్యమంలో పాల్గొని పోలీసుల దాడుల నుండి కాపాడుకొనడానికి ఎందరికో సినిమా రంగం ఆశ్రయమిచ్చింది. ఈ నేపథ్యంలో బ్రిటిష్ ఇండియాలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, స్వదేశీయులకు వ్యతిరేకంగా పనిచేయడం ఇష్టం లేక, సినిమా రంగంలోకి వచ్చిన వారు గౌరవనీయ హెచ్.ఎం రెడ్డి. మూకీ సినిమాల కాలంలోనే సినిమా రంగంలోకి కాలు మోపి, దక్షిణాదిన టాకి సినిమాల శకానికి ఆదిపురుషుడైన మహనీయుడాయన. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆయన కన్నడిగుడిగా పుట్టిన తెలుగువాడు. తెలుగు తమిళ టాకీ సినిమాలకు ఆధ్యుడు. తెలుగుతెరకు తొలి వెలుగు, దక్షిణ భారత టాకి పితామహుడు హెచ్.ఎం రెడ్డి.

అర్దేషీర్ ఇరానీ "ఆలం ఆరా" ఆర్థికంగా సాధించిన విజయంతో, వెంటనే ఆయనకు ఇతర ప్రాంతీయ భాషలలోనూ టాకీలు తీయాలన్న తలంపు రావడంతో, తమిళంలో టాకి చిత్రం తీయడానికి పూనుకున్నాడు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడానికి తన కంపెనీలో సైలెంట్ చిత్రాలకు డైరెక్టర్గా పనిచేసిన దక్షిణభారతీయుడు హెచ్.ఎం రెడ్డి నినియమించుకున్నాడు. హెచ్ ఎమ్ రెడ్డి దక్షిణ భారతంలో అత్యంత ప్రజాదరణ పొందిన మహాకవి కాళిదాసుని కథను తమిళ సినిమాకు ఎంపిక చేసుకున్నారు. ఇందులోని నటీనటులు కొందరు తెలుగువారు, తమిళులు .టెక్నీషియన్లు కూడా వేరువేరు ప్రాంతాలకు చెందినవారు. పైగా ఇందులో పాత్రలు తెలుగు, తమిళ భాషలను మాట్లాడినవి. తెలుగు, తమిళ సాంప్రదాయ కీర్తనలు చేర్చబడినవి. ఇలాంటి లక్షణాలున్న "కాళిదాసు" ఇటు తెలుగు సినిమాగా చెప్పలేము. అటు తమిళ సినిమాగా చెప్పలేము. కాకపోతే దీన్ని ద్విభాషా చిత్రంగా గర్తించవచ్చు


హెచ్.ఎం రెడ్డి "కాళిదాస" అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, పూర్తిస్థాయి తెలుగు సినిమా తీయాలని సంకల్పించుకొని, ధర్మవరం రామకృష్ణమాచార్యులు రాసిన "భక్త ప్రహ్లాద"ను సినిమాగా తీశారు. బాగా తెలిసిన పురాణ కథల్ని సినిమాలుగా తీయడం వల్ల నిర్మాతల పెట్టుబడికి గ్యారెంటీ ఉండేది." భక్త ప్రహ్లాద" లో పూర్తిస్థాయిలో తెలుగు మాటలు పాటలు ఉండేలా ఎలాగైతే జాగ్రత్తపడ్డాడో, అట్లాగే సహజత్వానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చేందుకు ప్రయత్నించారు. ఈ "భక్త ప్రహ్లాద" 1931 సెప్టెంబర్ 15న విడుదలైనట్లు తొలితరం సినీ చరిత్రకారులంతా రాసుకుంటూ పోవడంతో, ఓ 60 ఏళ్ల పాటు సెప్టెంబర్ 15 తెలుగు టాకీ పుట్టినరోజు హోదాను అనుభవిస్తూ వచ్చింది. నిజానికి తమిళ టాకీ కన్నా ముందుగానే విడుదలైందని చెప్పుకోవడానికి సెప్టెంబర్ 15 ను తెరమీదకు తెచ్చారు. కానీ తర్వాత కాలంలో జరిగిన పరిశోధనల వల్ల "భక్త ప్రహ్లాద" 1932 ఫిబ్రవరి 6న విడుదల అయినట్లుగా రమేష్ బాబు నిర్ధారించారు.

రెండు టాకీల తర్వాత హెచ్.ఎం రెడ్డి తీసిన మూకీ చిత్రం "జార్జ్ ఆఫ్ లైఫ్" 1932లో విడుదలైంది. ఇది ప్రేమ కథాచిత్రం. సంజీవ్ తన్వర్" సైలెంట్ సినిమా" పుస్తకం లో మనేక్ లాల్ జోషి పేరును చిత్ర దర్శకుడుగా చూపించడంతో, ఈ సినిమాకు హెచ్.ఎం రెడ్డి నిర్మాతగా వ్యవహరించి ఉండవచ్చునని చెబుతారు.

తొలి తెలుగు టాకీ "భక్త ప్రహ్లాద" విడుదలై విజయం సాధించిన తరువాత హెచ్.ఎం రెడ్డి గారు తీసిన రెండవ తెలుగు సినిమా "సతీ సావిత్రి". ఇదే కాలంలో సి పుల్లయ్య కూడా మరో "సతి సావిత్రి"ని మొదలుపెట్టారు. టాకీలు వచ్చిన తొలినాళ్లలో ఒకే కథాంశంతో రెండు చిత్రాలు తయారు కావడం "సతీ సావిత్రి"తోనే మొదలైంది. పోటీపడి విడుదలైన రెండు చిత్రాలలో సీపుల్లయ్య సినిమా పాటలు, పద్యాలతో ఆనాటి తరం ప్రేక్షకులను ఆకట్టుకొని విజయం సాధించింది. హెచ్.ఎం రెడ్డి సావిత్రి అంతగా విజయం సాధించలేదు. 1933 లో" సతీ సావిత్రి" ఫిబ్రవరి 4న విడుదలైన తర్వాత హెచ్.ఎం రెడ్డి తీసిన తొలి హిందీ చిత్రం "సీతా స్వయంవర్". ఇది కన్నడిగులు నెలకొల్పిన నిర్మాణ సంస్థ .

1927 నుండి 1933 వరకు బొంబాయి లోని మూకీలు, టాకీలు తీస్తూ వస్తున్న హెచ్.ఎం రెడ్డికి అక్కడ గొప్ప పేరు ప్రఖ్యాతులు వచ్చినవి. ఆయన మాటలు చేతలు, క్రమశిక్షణ నాటి సినిమా రంగంలో చాలా మందికి ఆదర్శమైంది. సమకాలికులైన పలువురు సినీ దర్శకులు, నిర్మాతలు రెడ్డిని చాలా గౌరవించేవారు. ఆ గౌరవంతోనే ఆయన 1934 1936 మధ్యకాలంలో కొల్హాపూర్ లో ఏర్పడిన కొల్హాపూర్ సినీటోన్, శాలిని సినీటోన్ స్టూడియో వారు తీసిన టాకీచిత్రాల నిర్మాణం పర్యవేక్షణ చేశాడు. తర్వాత కొల్హాపూర్ లో శాలిని సినీటోన్ స్టూడియో ప్రారంభమైంది. ఈ స్టూడియో నిర్వహణలో కూడా ప్రధాన పాత్ర వహించిన హెచ్.ఎం రెడ్డి, 1935లో అక్కడ రూపొందిన" రాజమకుట్ "(దర్శకుడు జి.తాంబే)," ఉషా" చిత్రాలకు నిర్మాణం పర్యవేక్షణ చేశారు.

1935లో సరస్వతీ టాకీస్ వారు" ద్రౌపది వస్త్రాపహరణం", లక్ష్మీ ఫిలింగ్స్ వారు ద్రౌపది మాన సంరక్షణ" పేరుతో రెండు భారీ చలనచిత్రాల నిర్మాణానికి సన్నాహాలు మొదలైనవి. హెచ్.ఎం రెడ్డి ఇతర పనుల వల్ల బిజీగా ఉండటంతో "ద్రౌపది వస్త్రాపహరణం" కు దర్శకుడిగా హెచ్ వి బాబుకు ఆ అవకాశం ఇప్పించాడు. తీసేది భారీ చిత్రం కనుక దర్శకత్వ పర్యవేక్షణ అయినా చేసి పెట్టమని కోరడంతో ఆయన అంగీకరించారు హెచ్.ఎం రెడ్డి పర్యవేక్షణలో నిర్మితమైన" ద్రౌపది వస్త్రాపహరణం" సినిమా విడుదలై థియేటర్లు ప్రేక్షకులతో క్రిక్కిరిసి పోయినవి. 1936 చివరి నాటికి కొల్హాపూర్ లో శాలిని సినీ టోన్ స్టూడియో మూతపడడంతో హెచ్.ఎం రెడ్డి మద్రాస్ కు చేరుకున్నారు. 1936 వరకు ఆయన తీసిన సినిమాలన్నీ ఇతర నిర్మాతల కోసం తీసినవే. ఇంతలో హెచ్ వి బాబుతోనే సరస్వతీ టాకీస్ వారికి" కనకతార" తీయడానికి ఉపక్రమించారు. ఈ చిత్ర నిర్మాణం మద్రాసులోనే జరుపుకుంది. ఇవన్నీ చూడటానికి రెడ్డి కొల్హాపూర్ నుండి




మద్రాస్ కు తన మకాం మార్చాడు. అలాగే తన సొంత నిర్మాణ సంస్థ రోహిణి పిక్చర్స్ లిమిటెడ్ను నెలకొల్పారు. రోహిణి పిక్చర్స్ బ్యానర్ మీద తీసిన "గృహలక్ష్మి" చిత్రం 1938 మార్చి 12న విడుదలై, బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. పౌరాణికాల వెల్లువలో కొట్టుకుపోతున్న తెలుగు సినిమాలకు సాంఘిక చిత్రాలతో గట్టి పునాది వేసింది, తన "గృహలక్ష్మి" చిత్రం ద్వారా హెచ్.ఎం రెడ్డి గారి అన్నది చారిత్రిక వాస్తవం.

"గృహలక్ష్మి" 1938 మార్చిలో విడుదలై విజయం సాధించడం, భాగస్తులు విడిపోవడం ఒకదాని వెంట ఒకటి జరిగిపోయినవి. అయినా మరో సినిమా తీయాలనుకుంటున్న సమయంలో, హెచ్.ఎం రెడ్డికి ఒక తమిళ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. అది ఆ కాలంలో అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. పైగా కథాంశం చారిత్రికం. చంద్రగుప్త నాటకం ఆధారంగా రూపొందించబడిన ఆ సినిమా పేరు "మాతృభూమి". నాటి భారతదేశం స్వాతంత్ర్య పోరాటానికి ఊతమిచ్చే విధంగా ఈ చారిత్రిక చిత్రాన్ని నిర్మించాడు రెడ్డి.

మాతృభూమి తమిళ చిత్రం తర్వాత, తన సొంత బ్యానర్ రోహిణి పతాకంపై సినిమాలు తీయనెంచి తీసిన రెండు హ్రస్వ చిత్రాలు "బోండాం పెళ్లి","చదువుకున్న భార్య". 1940లో రూపొందిన ఈ చిత్రాలలో "చదువుకున్న భార్య"కు రెడ్డిగారే స్వయంగా దర్శకత్వం వహించారంటారు. ఈ రెండు సినిమాలు కూడా తక్కువ నిడివి గల సినిమాలు కావడంతో రెండింటిని కలిపి విడుదల చేయడం జరిగింది. దీని తర్వాత హెచ్.ఎం రెడ్డి తిరిగి తన స్వీయ దర్శకత్వంలో సినిమాల నిర్మాణానికి నడుము కట్టి తీసిన చిత్రమే "తెనాలి రామకృష్ణ". ఇందులో రామకృష్ణుడిని సామాజిక బాధ్యత గల వ్యక్తిగా చూపించారు. రచయిత వెంపటి సదాశివబ్రహ్మం ,రెడ్డి గారితో కలిసి సంస్కరణ కోసం రామకృష్ణుని వికటకవిత్వాన్ని చక్కటి ఆయుధంగా వాడుకున్నారు. అప్పటి ఈ సినిమా ప్రకటనలలో నవ్యత అంటే సమాజంలో, పెద్ద మనుషుల్లో, వారి ఆలోచనలలో మార్పు రావాలనే భావం వచ్చేలా రాశారు. సినిమాలో తెనాలి రామకృష్ణుని విదూషక లక్షణాలను చూపిస్తూనే ,చిన్న చిన్న కథలను గుదిగుచ్చి చూపే ప్రయత్నం జరిగింది.

"తెనాలి రామకృష్ణ"పూర్తయిన వెంటనే హెచ్ ఎం రెడ్డి గారు, ఎల్ వి ప్రసాద్ ను హీరోగా చేసి "ఘరానా దొంగ" అనే సినిమాను( సత్యమే జయం మరో పేరు) మొదలుపెట్టారు. టాకీలు వచ్చిన తొలి రోజుల్లోనే బాక్సాఫీసును దృష్టిలో ఉంచుకొని జనాకర్షణ ముఖ్య ఉద్దేశం గా ప్రజలు ఆకర్షించే సినిమా టైటిల్ లు పెట్టడం, సినిమాలో గ్లామరస్ అప్పీలు ఉండే దృశ్యాలను చేర్చడం హెచ్ ఎం రెడ్డి గారితో ప్రారంభమైందని చెప్పవచ్చు. అసలాయనకు నెగటివ్ టైటిల్ తో నెగ్గుకు రావచ్చన్న ఫార్ములా పై నమ్మకం ఉండేది. 1938లో "రంగూన్ రౌడీ" పేరుతోనే "గృహలక్ష్మి" తీయాలనుకున్నా, భాగస్వాములైన బి.ఎన్.రెడ్డి వల్ల వెనక్కి తగ్గినా ,మళ్లీ 1942లో ఎల్వీ ప్రసాద్ తో తీసిన ఈ చిత్రానికి "ఘరానా దొంగ" అనే పేరు పెట్టడంలో సఫలీకృతులైనారు. ఈ చిత్రం పెద్దగా ఆడలేదు. కథ ఆ కాలంలో జనాలకు మింగుడు పడలేదు." సత్యమే జయం" తర్వాత "అమృత హస్తం" నిర్మించాలనుకుని సన్నాహాలు చేశారు. కానీ అంతలోనే రెండవ ప్రపంచ యుద్ధం ముంచుకు రావడంతో, సినిమాల నిర్మాణం మద్రాసులో దాదాపుగా ఆగిపోయింది. దాంతో రెడ్డి గారు తన మకాంను బెంగుళూరుకు మార్చివేశారు. 1942 డిసెంబర్ 23న మైసూర్ మూవీ టోన్ స్టూడియోస్ను ప్రారంభించారు. రెడ్డిగారు మైసూర్ మూవీ టోన్ స్టూడియో రూపకల్పన, నిర్వహణలో ఆయన పాత్ర ఎంతైనా ఉంది. 1944 వరకు ఆయన బెంగుళూరులో ఉండి ఈ స్టూడియోను చూసుకున్నారు. అక్కడి నుండి తన మకాంను బొంబాయికి మార్చినట్లుగా తెలుస్తుంది.

బొంబాయిలో తన సొంత బ్యానర్ రోహిణి ప్రొడక్షన్స్ పై హిందీ చిత్రం "జస్టిస్"(1946) తీశాడు. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి ఆయనే దర్శకుడని అనుకున్నారు. కానీ ప్రసిద్ధ హిందీ దర్శకుడు పణి మజుందార్ అని రమేష్ బాబు తొలిసారిగా తేల్చి చెప్పాడు.

హెచ్.ఎం రెడ్డి 1942లో "ఘరానా దొంగ "తీసిన తర్వాత, 1951 వరకు సుమారు 10 ఏళ్ల పాటు మరే తెలుగు సినిమా తీయలేదు. ఎందుకంటే ఆ కాలంలో నిర్మాణానికి అయ్యే ఖర్చును బట్టి చూస్తే, వ్యాపార దృష్ట్యా లాభదాయకం కాదని ఆయన అభిప్రాయపడినారు. తెలుగువారు హిందీ లోనూ చిత్రాలు తీయాలని హెచ్ ఎం రెడ్డి పిలుపునిచ్చారు. తెలుగు చిత్రాలను హిందీలో కూడా తీయడం వల్ల ఖర్చులు ఎక్కువగా పెరిగేదేమీ లేదు. సగం ఎక్కువ ఖర్చు అయినా మార్కెట్టు పదింతలు ఎక్కువ అవుతుందనే విషయం గుర్తుంచుకుంటే, వ్యాపార దృష్ట్యా ఎంత లాభదాయకమో తెలుస్తుంది అంటారు

స్వాతంత్ర్యానంతరం మారిన పరిస్థితులలో హెచ్.ఎం రెడ్డి 1950లో నిర్మాతగా తన ఆరవ చిత్రం "నిర్దోషి" ప్రారంభించారు. ఒక సామాజిక స్పృహతో నూతన పంథాలో తీసిన సినిమా "నిర్దోషి". ఒక మనిషిని నిర్దేశించే సమాజ సూత్రాల గురించి కాకుండా, మనిషిలో ఉండే అంతరాత్మను స్పృశించడం ఇందులో కనిపిస్తుంది. "నిర్దోషి" చిత్రాన్ని తెలుగు తారాగణంతోనే తమిళంలో కూడా విడుదల చేశారు. ఈ చిత్రం ద్వారానే నటుడు కాంతారావు వెలుగులోకి వచ్చాడు. "నిర్దోషి" తర్వాత అందరూ కొత్తవారితో సినిమా తీయాలని "ప్రతిజ్ఞ" సినిమాను ప్రారంభించారు. ఏకకాలంలో తెలుగు, తమిళ వెర్షన్లు చేయడానికి పూనుకున్నారు. సదాశివబ్రహ్మంతో తెలుగు స్క్రిప్ట్ రాయించారు. ఈ సినిమా నిర్మాణంలో తెర ముందు, వెనక జరిగిన ఎన్నో విశేషాలను ఆసక్తికరంగా తెలియజేసిన తీరు బావుంది.

"ప్రతిజ్ఞ" నిర్మిస్తున్న కాలంలోనే మరోవైపు హెచ్.ఎం రెడ్డి "వద్దంటే డబ్బు" చిత్ర నిర్మాణం కూడా చేశారు. 1954 ఫిబ్రవరి 19న విడుదలైన "వద్దంటే డబ్బు" పెట్టుబడి డబ్బును కూడా తిరిగి రాబట్టుకోలేకపోయింది." బీదల ఆస్తి" 1955 హెచ్.ఎం రెడ్డి తీసిన ఆఖరి చిత్రం. ఇది నిర్మాతగా పదవ చిత్రం. ఈ చిత్రం 1955 ఏప్రిల్ 7న విడుదల కాగా, తమిళ వెర్షన్ ఏప్రిల్ 14న విడుదలైంది. కానీ రెండు భాషలలోనూ బాగా ఆడలేదు. దాంతో రెడ్డి గారి ఆస్తి కూడా పోయింది. హెచ్.ఎం రెడ్డి ఆ తరువాత ఎన్ టి రామారావు తో "గజదొంగ" సినిమాను ప్రారంభించారు. కానీ ఆర్థిక కారణాలవల్ల ఆ సినిమా సగంలోనే ఆగిపోయింది. జయాపజయాలను నమ్ముకోకుండా సినిమాలు తీసిన, హెచ్.ఎమ్. రెడ్డి గారి సినీ జీవితం ముగింపు కూడా విషాదం గానే ముగిసింది.

పుస్తకంలోని చివరి మూడు వ్యాసాలు రెడ్డి గారి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి." హైదరాబాద్ రాష్ట్రంలో సినిమాల నిర్మాణం ప్రదర్శన, తెలుగులో తొలి సినిమా పాట తొలి సినిమా కవి, తెలుగు తొలి టాకీ హీరో, తొలి తెలుగు టాకీ నాయిక ,తొలి విలన్, గజదొంగ ఏమయ్యాడు" ఇలాంటి అంశాలను పరిశోధకుడిగా హెచ్ రమేష్ బాబు చర్చించి నిగ్గు తేల్చడం ద్వారా ఎన్నో కొత్త విషయాలను పాఠకుడు తెలుసుకోగలుగుతాడు. తొలి తరం నిర్మాత దర్శకుడైన హెచ్.ఎం రెడ్డి గురించి, ఈనాటి తరానికి ఎన్నో విలువైన విషయ విశేషాలు తెలియజేయడానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఖరీదైన పేపర్ మీద ఆకర్షణీయమైన ముఖచిత్రంతో వెలువడిన ఈ పుస్తకం దాచుకోదగింది.

కె.పి అశోక్ కుమార్
Cell : 9700000948

("హెచ్. ఎం. రెడ్డి తెలుగు సినిమా పితామహుడు" హెచ్ రమేష్ బాబు. చిన్నీ పబ్లికేషన్స్ .,నాగర్ కర్నూల్ ,మహబూబ్ నగర్.వెల 175/- , పేజీలు 214. ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)

# మరణం చివరిచరణమా!

మరణమెప్పుడూ..
చివరిచరణంకాదు
సహజమరణంఅనివార్యమని తెలిసినా...
ఈబలవన్మరణాలు.....
ఆత్మహత్యలు...
?...?...?...
*
నీ ఆత్మత్యాగం నిజంగా
శిఖరాయమానమైనదైతే!
మానవచరిత్ర ఉన్నంతకాలం
ఆరిపోని కుంపటిలా
నిప్పులజ్వాలౌతుంది
*
పెట్రోల్మంటల్లో
నిలువెత్తుఆత్మార్పణతో
సమాధానంలేని
ప్రశ్నవైమొలిచినా?
సమర్థించేవాళ్ళేఉండరు
జాలిపడేవాళ్ళుతప్ప..
*
ఒకవేళ!
నీవొకవీరసైనికునిలా
దేశంకోసంసరిహద్దుల్లో
నేలకొరిగితే!
నీప్రాంతపీడితులవిముక్తికోసం
ప్రాణత్యాగంచేస్తే!
నీ ఆత్మత్యాగాన్ని
పాటలల్లుకొని నిన్నమరుణ్ణి చేస్తరు
*
నీఆత్మార్పణమున్మాటికి
ఒక చారిత్రకమార్పుకు
నాంది పలకాలి
నీ ప్రాణత్యాగం
ప్రజలనాల్కలమీదఅనంతరాగమై
శిలాక్షరమై పల్లవించాలి



డా. బాణాల శ్రీనివాసరావు
: 9440471423

# రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946


# పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.


# స్వీకారం..





శర్వమ్మమరణం (కథలు)
రచయిత్రి : నాసరచేట్ల జయంతి
ప్రతులకు :
వాసరాచేట్ల మోహన్
ఫ్లాట్ నం 502, శ్రీ పద్మజాస్ నెస్ట్
అన్నపూర్ణ ఎన్క్లేవ్ ,బి.ఎస్.ఎన్.ఎల్ ఆఫీస్ దగ్గర
చందానగర్ ,హైదరాబాద్ 500050
వెల. రూ .230/
సెల్ :9985608077




అంతర్యం (కథలు)
రచయిత్రి : సునంద పరిమళ్ళ
ప్రతులకు
పురిమళ్ళ సునంద (గాజోజు)ఉపేందర్ రావు
సాహితి లోగిలి
ఇం.టి. నెంబర్ 1110694/5,
బుర్హాన్ పురం ,ఖమ్మం 507001
వెల. రూ .150/
చరవాణి :9441815722




నీరెళ్ళి పోతున్నా ..నది నాతోనే
కవి: వై .ఫణి రావు
ప్రతులకు
114705, 1 లైన్
కృష్ణబాబు నగర్
పలకలూరు రోడ్డు
గుజ్జనగుండ్ల
గుంటూరు 522006.




అష్టాక్షరి
(1000 కోట్స్)
సంకలన కర్త –సుధామా
ప్రతులకు
ఎ.వెంకటరావు (సుదామా)
ఇ.107, రాజాపుష్పా అట్రియా
గోల్డెన్ మెయిల్ రోడ్ , కోకాపేట
హైదరాబాద్ 5000075
Cell : 9849297958

# విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే..

**శ్రీ రాగా స్కూల్ లో విద్య బోధన భేష్.. కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని మేదరబస్తిలో గల శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని ఆ వృత్తికి న్యాయం చేస్తేనే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు చదువులో రాణించే విధంగా చూస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలపై కూడా చైతన్యం కల్పించాల్సి ఉందన్నారు. ఇటు విద్య అటు సేవాగుణం ఉంటే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యం చేస్తూ విద్యా విధానంలో రాణించే విధంగా కృషి చేస్తున్న శ్రీ రాగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ కవితలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. వార్షికోత్సవ సందర్భంగా ప్లే స్కూల్ చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్సులు, యూకేజీ విద్యార్థుల అన్యువల్ రిపోర్ట్ స్పీచ్, "సేవ్ వాటర్" మైమ్, 8వ తరగతి విద్యార్థుల శివతాండవం, "యమలీల" హాస్యనాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 2025 విద్యా సంవత్సర టాపర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.



అనంతరం స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ కవిత అతిథులను శాలువాలు, పూల బొకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 53వ డివిజన్ కార్పొరేటర్ బండి నరసింహ రావు, 52వ డివిజన్ కార్పొరేటర్ బానోత్ కళావతి, 30వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడెల్లి దుర్గా(బ్యాండ్ దుర్గ), మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముదురకోళ్ల కిషోర్, మాజీ కౌన్సిలర్ చారి, మేరెల్ల రమేష్, టి.రాజశేఖర్ (వైస్ ప్రిన్సిపాల్, ఎక్సలెంట్ స్కూల్ మణుగూరు), శ్రీ రాగా స్టాఫ్ సర్వేశ్వర రావు, రాంబాబు, రాజ్ కుమార్, అనుష, కవిత, రేష్మా, భువన, శ్రావణి, అన్నపూర్ణ, అనుష, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు

- **అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలు**
- **రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు**
- **రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, మహా :** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై నిషేధాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు రామగుండం సిటీ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆదివారం రామగుండం సిపి తన కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లుఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారనే పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు, రోడ్లపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని,ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు.ఈ నిషేధాజ్ఞలు 01 మార్చి నుండి ఏప్రిల్ 01 వరకు అమల్లో ఉంటాయని చెప్పారు.

**డీజే, డ్రోన్లపై నిషేధాజ్ఞల పొడిగింపు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు,విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ కోసం డీజే సౌండ్స్ వినియోగిస్తున్నట్లు గమనించామని తెలిపారు.అయితే కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మైక్ సెట్ వినియోగానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు కూడా 01 మార్చ్ నుండి ఏప్రిల్ 0 వరకు అమల్లో ఉంటాయని వివరించారు.

**కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్ 2016 లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(1)(a) నుండి (f), సెక్షన్ 22(2)(a), (b), సెక్షన్ 22(3),సిటీ పోలీస్ యాక్ట్ 1348 నం. IX ఫసలీ,సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం మార్చి 01 ఉదయం 6 గంటల నుండి 01 ఏప్రిల్ ఉదయం 6:00 గంటల వరకు అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కాలంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు,సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరిట సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించేందుకు ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రామగుండం సిపి కోరారు.

## కార్మికుల కొరకు చేసిన పోరాటం

# నాకు సంతృప్తిని ఇచ్చింది

- **పోరాటాల వల్లనే ప్రభుత్వాలు దిగి వస్తాయి**
- **నా ఊరు మనుషులు నన్ను ఇంతగా ప్రేమిస్తారని అనుకోలేదు**
- **ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మావోయిస్టు నేత బండి ప్రకాష్ వెల్లడి**



**మందమర్రి, మహా :** నా బాల్యం నుండి కార్మికుల కొరకు చేసిన పోరాటం నాకు సంతృప్తిని ఇచ్చిందని మాజీ మావోయిస్టు నేత బండి ప్రకాష్ వెల్లడించారు. ఆదివారం మందమర్రి సింగరేణి సి ఈ ఆర్ క్లబ్ లో మాజీ మావోయిస్టు నేత బండి ప్రకాష్‌కు తన చిన్ననాటి మిత్రులు ఆత్మీయ సమ్మేళనం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఒక సింగరేణి కార్మికుని కుమారుడిగా జన్మించి తాను ఆ కార్మికులు, పీడిత ప్రజల విముక్తి కొరకు పోరాటం చేయడం నాకు సంతృప్తినిచ్చిందని వెల్లడించారు. తల్లిదండ్రులను బంధువులను విడిచి అజ్ఞాతంలో ఉండడం కొంతమేరకు బాధనిపిచ్చినప్పటికీ నాకు భోజనం పెట్టిన ఎందరో తల్లులు, విద్యార్థులు, యువజనలు మార్పు కొరకు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు పోరాటం చేయడం జీవితంలో మర్చిపోలేని అనుభూతిని మిగిల్చిందని స్పష్టం చేశారు. నేటి యువత మద్యం, మాంసం, గంజాయి లాంటి వ్యసనాలకు బానిసలు కాకుండా పరిశ్రమల స్థాపన కొరకు పాలకవర్గాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం పోరాటాల వల్లనే ప్రభుత్వాలు దిగి వస్తాయని చరిత్ర ద్వారా తెలుస్తుందని స్పష్టం చేశారు. నా ఊరు మందమర్రి మనుషులు, కార్మికులు, నా చిన్ననాటి స్నేహితులు నన్ను ఇంతగా ప్రేమిస్తారని అనుకోలేదని ఆనంద భాష్పాలు రాల్చారు. అంతకుముందు బండి ప్రకాష్, హేమ, అబ్బాసి నారాయణ, లక్ష్మి దంపతులకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, బోడ జనార్ధన్, ఐ ఎన్ టి యు సి వేజ్ బోర్డు కమిటీ సభ్యులు బి జనక్ ప్రసాద్, సీనియర్ ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, తెలంగాణ సంస్కృతిక సారధి సభ్యులు అంతడుపుల నాగరాజు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగార్ల మల్లయ్య, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు ఓ రాజశేఖర్, వికాస వేదిక రాష్ట్ర కార్యదర్శి హనుమాన్ల రవీందర్, మాజీ మండల ఉపాధ్యక్షులు వజీర్ సుల్తాన్, మాజీ పాత్రికేయులు వాసాల శంకర్, సంఘీ రవీందర్ తదితరులు డప్పు చప్పుళ్లతో దంపతులకు పూలు వెదజల్లుతూ సభకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వై సత్యనారాయణ, వెంకట్రావు, ఏబూసి అగయ్య, సిఐటియు నాయకులు ఎస్ వెంకటస్వామి, తుంగపిండి ఉపేందర్, ఖ్యాతం రవి, శ్యామ్ సుందర్ రెడ్డి, న్యాయవాది చిరంజీవి పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఎంఆర్‌పీఎస్ అమరుల దినోత్సవం

**కారేపల్లి, మహా:** ఎంపీఆర్‌పీఎసఉద్యమంలో అసువులు బాసిన అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం కారేపల్లిలో నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ నేతలు ఆదెర్ల రామారావు, ఆదెర్ల అంజయ్య అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమరుల చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు కాపా ప్రసాద్ మాదిగ మాట్లాడుతూ అమరుల ఉద్యమఫలితమై ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. అమరుల త్యాగాలు వృధాకానీయమన్నారు. మాదిగల అభివ□ద్ధికి అమరులు చేసిన క□షి శ్లాఘనీయమని, వారు చిరస్మరనీయులని కొనియాడారు. ఈసందర్బంగా కళాకారుడు ఆదెర్ల శంకర్‌రావు పాడిన పాట ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో



జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగేందర్ మాదిగ, గజ్జల శ్రీనివాసరావు, ఆదేర్ల ఉపేందర్, కేసగాని బాలకృష్ణ, చింతల శ్రీను, చీకుర్తి అంజయ్య, ఇల్లందుల సాంబ, ఆదేర్ల వీరస్వామి, ఆదేర్ల అరుణ, చీకుర్తి గురమ్మ, మాట్ల ఉమా, గౌరీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# నమ్మించి కోట్లాది రూపాయలు వసూలు చేసిన వ్యక్తి అరెస్టు

**ఇసుక క్వారీల్లో భాగస్వామ్యం కల్పిస్తామంటూ టోకరా**

**మంచిర్యాల, మహా :** ప్రజలను నమ్మించి కోట్లాది రూపాయలు వసూలు చేసుకొని తప్పించుకు తిరుగుతున్న వేముల శ్రావణ్ గౌడ్ ను అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆదివారం భీమారం పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇసుక క్వారీ లభించిందని, పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయంటూ దాదాపు 62 మంది నుంచి ఒక కోటి 58 లక్షల 25 వేల రూపాయలు అప్పుగా తీసుకున్నట్టు ఆయన తెలిపారు. తీసుకున్న డబ్బులు ఇవ్వక గ్రామం నుండి పరారైనట్లు చెప్పారు. నమ్మదగిన సమాచారం మేరకు పరారీలో ఉన్న శ్రావణ్ గౌడ్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు. గతంలో నిందితుడు బేకరీ నిర్వహించాడని పేర్కొన్నారు. ప్రజలు అధిక వడ్డీలు వస్తాయని భావించి ఎలాంటి ఆధారం లేని వ్యక్తులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన హితవు పలికారు. ప్రజలకు వివిధ ఉద్యోగాల వల్ల వచ్చిన డబ్బులను జాతీయ బ్యాంకులలో వేసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పోలీసులు ఉన్నారు.



# ఒకే స్కూలు కోసం రెండుసార్లు భూమిపూజ చేసిన మునుగోడు ఎమ్మెల్యే...

- **మునుగోడులో 'ఇంటిగ్రేటెడ్' అయోమయం..**
- **గతంలో కల్వకుంట్ల, ఇప్పుడు మునుగోడులో శంకుస్థాపన..**
- **ఒకే పాఠశాలకు రెండుసార్లు పూజలేంటని ప్రజల విస్మయం..**
- **రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ అయోమయంలో స్థానికులు..**



ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం ఎమ్మెల్యే విమర్శలు..

**మునుగోడు మహా :** మునుగోడు నియోజకవర్గంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' నిర్మాణం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకే ప్రాజెక్టుకు రెండుసార్లు భూమిపూజలు నిర్వహించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. నిన్న కల్వకుంట్ల, నేడు మునుగోడు.. అసలు పాఠశాల ఎక్కడ కడుతున్నారో తెలియక అటు అధికారులు, ఇటు ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

**ఏడాదిన్నరలోనే మళ్లీ పూజలా?**

గతంలో 2024, అక్టోబర్ 11న కల్వకుంట్ల గ్రామం వద్ద ఇదే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అట్టహాసంగా భూమిపూజ చేశారు. అయితే ఆ పనుల పురోగతి ఏమైందో ఏమో కానీ ఆదివారం (మార్చి 1, 2026న) మునుగోడులోని దుబ్బ కాలువ రోడ్డు వద్ద మరోసారి రూ. 200 కోట్ల వ్యయంతో అదే పాఠశాలకు శంకుస్థాపన చేయడం గమనార్హం.ఒకే స్కూలుకు రెండుసార్లు భూమిపూజలు చేయడం అసలు నిర్మాణం ఎక్కడ జరుగుతుందో ప్రభుత్వం స్పష్టం చేయాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్య, వైద్యాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. కొందరికి గొర్రెలు, మరికొందరికి చేపపిల్లలు ఇచ్చి సరిపెట్టారని, నాణ్యమైన చదువును దూరం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పార్టీ అని, అందుకే 2,500 మంది విద్యార్థుల కోసం ఈ సమగ్ర పాఠశాలను తీసుకొచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. నల్గొండ జిల్లా రాజకీయాలను శాసించే జిల్లా అని మునుగోడులో విద్యా వ్యవస్థను మార్చడమే తన లక్ష్యమని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతను తీర్చాలని కార్పొరేట్ శక్తుల నుంచి విద్యను కాపాడాలని కోరారు.అయితే ఒకే ప్రాజెక్టును రెండు చోట్ల ప్రారంభిస్తుండటంపై రాజకీయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఇది అభివృద్ధి వ్యూహమా లేక ప్రచార ఆర్భాటమా?" అంటూ చర్చ సాగుతోంది. స్థలం మార్పుపై అధికారుల నుంచి సరైన వివరణ లేకపోవడం ఈ అయోమయానికి కారణమని తెలుస్తోంది.

# వెలుగుమట్ల పేదల ఇండ్ల కూల్చివేతకు నిరసన

**అఖిల పక్షం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మదహనం**

**కారేపల్లి, మహా :** ఖమ్మం వెలుగుమట్లలో పేదల ఇండ్లను కూల్చివేతను నిరసిస్తూ అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆదివారం కారేపల్లిలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. రెక్కాడితేకాని డొక్కాడని పేదల కష్టార్జితాన్ని నెల మట్టం చేయటంపై అఖిల పక్షనేతలు ఖండించారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వై.ప్రకాశ్, మాస్ లైన్ జిల్లా నాయకులు గుగులోత్ తేజానాయక్, బీఆర్ఎస్ నాయకులు భూక్యాచందునాయక్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నిరంకుశ జూలుం ప్రదర్శిస్తుందన్నారు.పేదలు లక్షలు అప్పు చేసి ఇండ్లుకట్టుకున్నారని, నిర్మాణ సమయంలో అభ్యంతరం చెప్పని ప్రభుత్వం ఇండ్లు కట్టి నివాసం ఉంటుండగాఎవరికి నోటీసులు ఇవ్వకుండా తెల్లవారుజామునా పోలీసు బలగాలతో వచ్చి పేదల కలసౌదవాలను కూల్తి పుట్టేడు దుఖాన్ని నింపారన్నారు. పేదలకు అండగా వెళ్ళిన



అఖిల పక్ష నేతలపై కేసులు పెట్టి భయభ్రంతులకు గురిచేయటం ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిదర్శనని విమర్శించారు. పేదల ఇండ్ల కూలివేతకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు బాధ్యత వహించాలన్నారు. వెలుగుమట్ల బాధితులను డబల్ బెడ్ రూమ్‌లు కట్టించి ఇవ్వాలని నష్టపరిహారం చెల్లించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, అన్నారపు కృష్ణ, బీ.వీరు, రాయుడు, మంగయ్య, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామ విద్య బలోపేతానికి చర్యలు -గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

**పీడీ పీఈటీల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికకు హాజరు**

**ఆదిలాబాద్ మహా :** వ్యాయామ విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని తెలంగాణ పిడి, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో నిర్వహించిన తెలంగాణ పిడి, పీఈటీల జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధూమర్ల నిరంజన్ తో కలిసి అందజేశారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా రంగానికి అధిక నిధులు కేటాయించడంతోపాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, నూతన క్రీడా పాలసీ ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఇందుకోసం త్వరలోనే పాఠశాలలో వ్యాయామ విద్య బోధించేందుకు ప్రభుత్వం ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో సిలబస్ ప్రవేశపెట్టబోతుందన్నారు. రాష్ట్ర సంఘం డైరీ క్యాలెండర్లను కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ఉపాధ్యాయ సంఘాల సంఘాల



రాష్ట్ర జిల్లా బాధ్యుల తో కలిసి ఆవిష్కరించారు. నూతనంగా జిల్లా అధ్యక్షులుగా సి హెచ్ కాంతారావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్ స్వామి, కోశాధికారిగా ఏ సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులుగా బి గోపాల్, జె అశోక్ , జాయింట్ సెక్రటరీలుగా ఆర్ మోహన్ సింగ్ , వినోద్, సంఘం గౌరవ సలహాదారుగా దయానంద్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పి శంకర్ నాయక్ ప్రకటించారు.సమావేశంలో పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకర్ రావు, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర రావు, పిడి, ఈటిల సంఘం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మొగులాల్, ఎన్నికల అధికారి శంకర్ నాయక్, పిఆర్టియు తెలంగాణ అదిలాబాద్ జిల్లా శాఖ నూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్, కోశాధికారి ముజీబ్, సంఘం జిల్లా రాష్ట్ర బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి..

- **రాములబండలో భక్తి పారవశ్యం**
- **భక్తిశ్రద్ధలతో రథోత్సవంలో పాల్గొన్న మంత్రి**
- **ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ..**



**నల్గొండ మహా :** నల్గొండ మండలం రాములబండ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం మధ్య మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి స్వయంగా పాల్గొని రథాన్ని లాగారు. భక్తుల జయజయధ్వానాల మధ్య సాగిన ఈ రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామస్తులంతా ఐకమత్యంతో బ్రహ్మోత్సవాలను ఇంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ సీతారామచంద్రస్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

**శివాజీ విగ్రహ ఆవిష్కరణ..**

అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. దేశ భక్తికి, ధైర్యానికి శివాజీ నిదర్శనమని ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, నల్గొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, స్థానిక సర్పంచ్ చామకూరి శంకర్ గౌడ్, నాయకులు ప్రకాష్ రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## అద్దె భవనాలోంచి ప్రభుత్వ భవనాల్లోకి

# రిజిస్ట్రేషన్ కార్యాలయాలు..

- **రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు మరింత పారదర్శకంగా...**
- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..**



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్,సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలని ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కాకుండా, ప్రభుత్వ భవనాల్లోనే నిర్వహించాలన్న ప్రభుత్వ ఆశయం మేరకు శనివారం పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలను నార్సింగిగండిపేట్ లోని నూతన కార్యాలయంలోకి మార్చారు. రాజేంద్రనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇకపై మహిళా సమైక్య భవనం నుంచి సేవలందిస్తుంది.నార్సింగి గండిపేట రిజిస్ట్రేషన్ కార్యాలయం బండ్లగూడ జాగీర్, హిమాయత్ సాగర్ లోని పాత మున్సిపల్ కార్పొరేషన్ భవనంలోకి మార్చబడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూప్రభుత్వ ధనాన్ని ఆదా చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అద్దె భవనాల్లో ఇరుకుగా ఉన్న కార్యాలయాలను విశాలమైన ప్రభుత్వ భవనాల్లోకి మార్చడం ద్వారా ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయి. అన్ని వసతులతో కూడిన ఈ భవనాలు ప్రజలకు మరింత చేరువగా ఉంటాయి.భారీగా చెల్లిస్తున్న అద్దెల భారాన్ని తగ్గిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా-బండారి అనూష

**ఆదిలాబాద్ మహా :** ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ ఛైర్ పర్సన్ బండారి అనూష సతీశ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన ఆత్మీయ సత్కార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ గా ఎన్నికైన ఆమెను విశ్రాంత ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. అనంతరం వారి సమస్యలపై చర్చించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి తప్పక తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మిత్రురాలి ఇంట విషాదం అండగా స్నేహహస్తం..

- **చిట్యాల జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థుల మానవత్వం..**
- **మిత్రురాలి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం..**



**చిట్యాల మహా :** చిన్ననాటి స్నేహితులు ఒకరికొకరు తోడుంటే ఆ బంధమే కొండంత అండ అవుతుందని చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) 199596 బ్యాచ్ విద్యార్థులు నిరూపించారు. కష్టాల్లో ఉన్న తమ సహచర మిత్రురాలి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించి స్నేహానికి అసలైన అర్థాన్ని చాటారు.199596 విద్యా సంవత్సరంలో పదో తరగతి బిసెక్షన్‌లో చదువుకున్న పిల్లుట్ల వరలక్ష్మి భర్త వీరయ్య ఇటీవల కన్నుమూశారు. కుటుంబ పెద్ద మరణంతో వరలక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్న మిత్రులంతా కలిసి రూ.40,000 నగదును సేకరించి ఆ మొత్తాన్ని బాధితురాలికి అందజేసి తమ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నప్పుడు కలిసి చదువుకున్న స్నేహితులకు ఆపద వస్తే ఆదుకోవడం తమ కనీస బాధ్యతని పేర్కొన్నారు. తమ వంతు సాయం ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.మల్లేశం, ఎం.లింగయ్య, కె.కృష్ణ, బి.శ్రీనివాస్, బి.సునీత, అలివేలు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తా...

**శంషాబాద్ లో కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు..**




**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంచర్ల శ్రీనివాస్, కోలాన్ ప్రదీప్ రెడ్డి, బుచ్చిరెడ్డి, కోన్నమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శంషాబాద్ లొ ఆదివారం ఘనంగా నిర్వహించారు.బిఆర్ఎస్ పార్టీ నాయకుల సమక్షంలో కార్తీక్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తా. ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు, మరింత ప్రజాసేవ చేసే శక్తి కలగాలని పార్టీ నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజేందర్, పరమేశ్వరి నరేందర్, వెంకట్ రెడ్డి, హన్మంత్ ముదిరాజ్ ,రాఘవేందర్ రెడ్డి ,గుంటి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశనుండే లోకజ్ఞానం కలిగి ఉండాలి

**జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప**





**ఆమనగల్లు, మహా :** విద్యార్థులు సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాపించి 34 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాఠశాల ఆవరణలో వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప, సీనియర్ ఉమెన్స్ ఎన్సిసి ఇన్స్పెక్టర్ సరోజ బాల ఠాగూర్, డాక్టర్ బి పుల్లయ్య హాజరయ్యారు.చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ అంశాలపై రూపొందించిన నృత్యాలు, దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, అతిథులు హర్షాతిరేకాలతో అభినందించారు. మెజిస్ట్రేట్ కాటమ్ స్వరూప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వివేక విద్యా భారతి విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. గతంలో ఇదే పాఠశాలలో చదివి వివిధ ఉన్నత స్థాయిలలో రాణిస్తున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. సాధారణ బడ్జెట్ పాఠశాల స్థాయిలో ఉండి కూడా కార్పొరేట్ పాఠశాలలను మించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు ఇతర అన్ని రంగాల్లో తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని,విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువు పై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,విద్యార్థులు సోషల్ మీడియాల కు బానిసలు కాకుండా తగు జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్న, ఉన్నత స్థాయిలో ఉండాలన్న సరే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో పాటు తల్లిదండ్రుల పెంపకం చాలా ముఖ్యం అని అన్నారు. మండల స్థాయి, జిల్లాస్థాయి మరియు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు ప్రిన్సిపాల్ మహమూద్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బార్ కోసమా! లేక మరేదైనా కారణమా?

- కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యం?
- రహదారికి అంచున పొంచిఉన్న ప్రమాదం!




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఓ బార్ కోసం రోడ్డు క్రాస్ చేయడంలో అంతర్యం ఏమిటి అని పలువురు మండిపడుతున్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని నాగార్జునసాగర్ హైవే నుంచి మంచాల్ రోడ్డు వరకు, కృష్ణ వాటర్, బైపాస్ రోడ్డులో జరుగుతున్న రోడ్డు పనులలో, ఓ బార్ కోసం రోడ్డు క్రాస్ చేయడంలో అంతర్యం ఏమిటి..?. బార్ కు సంబంధించిన బోర్డు తీయలేకనా... మరి ఏదైనా కారణమా....? దీనికి సంబంధించిన కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. రహదారి అంచున ప్రమాదానికి కారణమయ్యే బార్ బోర్డును తొలగించకపోవడం, రోడ్డును మళ్లించడం అనేది ప్రజలలో పలు అనుమానాలకు తావివ్వడం జరుగుతుందని, అధికారులు సమాలోచన చేసి వెంటనే బార్ బోడును తొలగించి, రోడ్డును స్ట్రైట్ గా వేసి ప్రమాదాలను నివారించాలని పలువురు అభిప్రాయపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నిబంధనల ఉల్లంఘన... ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో నాగార్జునసాగర్ రహదారికి ఇరువైపులా, అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు నిబంధనలను ఉల్లంఘించి, వ్యాపారస్తులు అక్రమంగా తమ వ్యాపార సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మరికొందరైతే రాజకీయ పలుకుబడి ఉపయోగించి, రోడ్డు స్థలాన్ని ఆక్రమించి కొట్టాలు (షెడ్డు)వేసుకోవడం, కంటైనర్లు ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమాలోచనచేసి, రోడ్డు నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగర్ రహదారికి ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న, కొట్టాలను, సూచిక బోర్డులను తొలగించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజాసేవ ద్వారానే సమాజంలో గుర్తింపు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ గా బాధ్యతలు చేపట్టిన ఏనుమల్ల రమేష్ ను సామాజిక కార్యకర్త రెంజర్ల రాజేష్ ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, ప్రజాసేవ ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పేదలకు అండగా ఉండి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని,రాజకీయాలకు అతీతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోరటిరమేష్, సింగల్ విండో డైరెక్టర్ జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



చక్రిపురం

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో

# ఏకవాక్య సంకీర్తనలు

**కుషాయిగూడ, మహా:** చక్రిపురంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తి వాతావరణంలో "శ్రీరామ జయ రామ జయ జయ రామ" ఏకవాక్య సంకీర్తనలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ సంకీర్తనలు మధ్యాహ్నం 1:30 గంటల వరకు కొనసాగాయి. భక్తి గీతాలు ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక స్ఫూర్తితో నింపాయి. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని నేత అరవింద్ హనుమాన్ చాలీసా, ఓం నమో నారాయణాయ, శ్రీరామ జయ రామ, ఏడుకొండలవాడా శ్రీ వెంకటరమణ వంటి భక్తి పాటలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో జరిగిన ఈ ఏకవాక్య సంకీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అరవింద్ మాట్లాడుతూ పిల్లలకు హిందూ ధర్మంపై అవగాహన కల్పించడం అవసరమని, నేటి బాలలే రేపటి భవిష్యత్తని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ మూలుగు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ భక్తి మనసుకు ప్రశాంతతను ఇస్తుందని, ప్రతిరోజూ ఆలయానికి వచ్చి కొంత సమయం గడిపితే మానసిక శాంతి కలుగుతుందని అన్నారు. కలిగిరి పూజిత రెడ్డి మాట్లాడుతూ భక్తి వల్లే మంచి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రధర్ రెడ్డి, డాక్టర్ రష్మీ అర్చన రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ కనకారావు, పద్మ-వెంకటరెడ్డి దంపతులు, జయతో పాటు సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై

# సంచలన ఆరోపణలు

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు**




**హైదరాబాద్ / కరీంనగర్ మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పై తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార దుర్వినియోగం, అవినీతి, అధికారాల అతిక్రమణ వంటి అనేక అంశాలపై ఆధారాలతో త్వరలోనే బయటపెడతానని తెలిపారు.

**ప్రభుత్వ వాహనాల దుర్వినియోగం**

- హైదరాబాద్‌లో ఒక ఇన్నోవా క్రిస్టా వాహనం ఏర్పాటు చేసి, కరీంనగర్‌కు చెందిన కానిస్టేబుళ్లను డ్రైవర్లుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.
- ఆ వాహనాన్ని ఐఆర్ఎస్ అధికారి వికాస్ అగర్వాల్ తండ్రికి కేటాయించారని తెలిపారు.
- రోజూ ఆయనను కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ వాహనం, కానిస్టేబుళ్లను వినియోగిస్తున్నారని చెప్పారు.
- సాధారణ సివిల్ పౌరుడికి ప్రభుత్వ వాహనం ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు.

**కుటుంబ సభ్యులకు ప్రత్యేక సదుపాయాలు**

- కమిషనర్ తన అన్న, తన భార్య విధుల కోసం ప్రభుత్వ వాహనాలు మరియు పోలీస్ బందోబస్తు వినియోగిస్తున్నారని ఆరోపించారు.
- దీనికి ఆయనకు ఉన్న అధికారం ఏమిటని ప్రశ్నించారు.

**అవినీతి, వసూళ్ల ఆరోపణలు**

- జిల్లా వ్యాప్తంగా ఇసుక, రేషన్ బియ్యం, గుట్కా దందాల్లో వసూళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.
- ఏసీపీ విజయ్ కుమార్, సీఐ సృజన్ రెడ్డి, ఎంటీఓ కిరణ్ వంటి అధికారులు డబ్బులు వసూలు చేసి కమిషనర్‌కు అందజేస్తున్నారని ఆరోపించారు.
- వీణవంకలో ఒక క్వారీ యజమాని, ల్యాండ్ ఓనర్ మధ్య వివాదంలో నేరుగా జోక్యం చేసుకుని సెటిల్మెంట్ చేశారని పేర్కొన్నారు.

**హోంగార్డుల బదిలీలు – భారీ అవినీతి?**

- ఇటీవల 337 మంది హోంగార్డులను బదిలీ చేశారని తెలిపారు.
- జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల నుండి ఒక్కో హోంగార్డు నుండి రూ.1 లక్ష వసూలు చేసి కరీంనగర్‌కు బదిలీ చేశారని ఆరోపించారు.
- మొత్తం రూ.1.86 కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు.

**మాల్ NOC – రూ.25 లక్షల లంచం?**

- కరీంనగర్‌లో కొత్తగా ప్రారంభమైన "SN PRIDE" మాల్‌కు NOC క్లియర్ చేయడానికి రూ.25 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు.

**వ్యక్తిగత ప్రయోజనాలు**

- తన కుటుంబ సభ్యులతో కలిసి దాబాలో భోజనం చేసిన బిల్లును స్థానిక అధికారులతో కట్టిస్తున్నారని ఆరోపించారు.

**డీజీపీకి ప్రశ్న**

డీజీపీ శివధర్ రెడ్డి గారికి ఈ విషయాలు తెలిసి జరుగుతున్నాయా? లేక తెలియకుండా జరుగుతున్నాయా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

**హెచ్చరిక**

అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు కరీంనగర్ సీపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తన వద్ద ఉన్న వీడియో ఆధారాలను బయటపెడతానని హెచ్చరించారు. ఐపీఎస్ అధికారుల పట్ల గౌరవంతో ఇప్పటివరకు బయటపెట్టలేదని, కానీ చర్యలు తీసుకోకపోతే ప్రజల ముందుకు తీసుకువస్తానని స్పష్టం చేశారు.

# అసైన్డ్ భూములు తీసుకుంటే లేఅవుట్లల్లో ప్లాట్లు

- కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి
- గుర్రంగూడ భూ సాగులోని పేదలకు న్యాయం చేస్తాం
- రెవెన్యూ అధికారులతో మాట్లాడిన కాంగ్రెస్ నేత



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బడుగు, బలహీనవర్గాలకు నాడు ఇందిరమ్మ రాజ్యంలో భూములు ఇస్తే... నేడు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని మరోసారి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని, గుర్రంగూడలో దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను లాక్కొబోమని కెఎల్ఆర్ హామీ ఇచ్చారు. సాగులో ఉన్న రైతులను ఒప్పించి... తగిన ప్లాట్లను కేటాయిస్తామని.... లేఅవుట్లు వేసి సకల సదుపాయాలు కల్పిస్తామని కిచ్చెన్న చెప్పారు.ఇప్పటికే ఆర్టీసీ డిపో కోసం తీసుకున్న భూముల సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ప్లాట్ల అసోసియేషన్ కు, ఎస్సీల మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించి దాదాపు 160 ఎకరాల భూ సమస్యను తీర్చేందుకు అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడుతానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో వెంటనే రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి వివరాలు సేకరించారు. పేదలకు పూర్తి న్యాయం చేస్తామని ఎలాంటి ఆందోళన, భయాలు అక్కర్లలేదని కిచ్చెన్నగారు స్పష్టం చేశారు. ఆర్టీసీ తీసుకున్న భూముల్లో ప్లాట్ల యాజమానులకు, దళితులకు మధ్య ఉన్న విబేధాలను త్వరగా పరిష్కరించాలని అధికారులను లక్ష్మారెడ్డి కోరారు.



# కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం...

**రాజేంద్రనగర్ మహా ;** కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అకాడమీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లోని దేవా కిక్ బాక్సింగ్ అకాడమీలో గత రెండు సంవత్సరాలుగా శిక్షణ పొంది, ఢిల్లీలోని కేడి జాదవ్ ఇండోర్ స్టేడియంలో 5 వ ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ లో చిల్డ్రన్ (21 kg) కేటగిరీలో కోర్ర భూవిక సిల్వర్ బ్రౌన్ మెడల్, (30 kg) గుర్రం భవ్య శ్రీ ,బ్రౌన్ మెడల్, (42 ) కేటగిరిలో పూజారి హారిక గోల్డ్ బ్రౌన్ మెడల్, (28)కేటగిరి గౌలీకర్ హర్ష సిల్వర్ బ్రోనా, మెడల్స్ లను కోచ్ నర్సింగ్ రావు శిక్షణలో పథకాలు సాధించిన విద్యార్థులకు శనివారం శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలను సాధించిమరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని పలువురు ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇంచార్జ్ శ్రీకాంత్, భాగ్యరాజ్, నరసింహ రాజు విశ్వనాథ్ యాదవ్,శ్రీనివాస్ పాండు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గుండోజీ రంగాదాసు ఎడ్యుకేషనల్ ట్రస్ట్

# నూతన కార్యవర్గ ఎన్నిక



- నూతన కార్యవర్గం గ్రామ సేవలో పాల్పంచుకోవాలి
- బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బండరావిరాల గ్రామ అభివృద్ధి, విద్య, సామాజిక సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో, కార్యవర్గ సభ్యులను వివిధ బాధ్యతలకు విజయ్ కుమార్ ఎంపిక చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని, బండరావిరాల గ్రామంలో "గుండోజీ రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్ట్" నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించబడింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు మరియు బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా ఏర్పుల నరేష్, కొత్త ప్రశాంత్ గౌడ్ ను ఎన్నుకున్న అనంతరం బాధ్యతలు అప్పజెప్తూ, నియామక పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధి, విద్య, సామాజిక సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో, కార్యవర్గ సభ్యులను వివిధ బాధ్యతలకు ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని, నూతన కార్యవర్గం గ్రామ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ట్రస్ట్ ద్వారా విద్యా పరమైన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఏర్పుల నరేష్, ఇతర సభ్యులు తమపై ఉంచిన నమ్మకానికి సర్పంచ్ కి, అడ్వైజర్లకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా విద్యార్థులకు విద్యనందిస్తున్న ట్యూటర్లను ట్రస్టు సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు గుండ్ల భవాని శివ ముదిరాజ్, ఏర్పుల హరి కృష్ణ, గ్రామ యువకులు కందికంటి కృష్ణ, ట్యూషన్ పాయింట్ కమాండర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడి పిల్లల దహనంతో

# వాయు కాలుష్యం..?

- ఈ కారణంగా రోగాల బారిన పడనున్న ప్రజలు
- స్థానిక రైతుల ఆవేదన పట్టించుకోని అధికారులు!

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని ఓ హాచరీస్ ఆవరణలో జరుగుతున్న దారుణంతో చుట్టుపక్కల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని ఓ హాచరీస్ నిర్వాహకులు, హాచరీస్ లోని వ్యర్థాలతో పాటు, కోడి పిల్లలను సజీవంగానే తగలబెడుతున్నడంతో చుట్టుపక్కల పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ చెత్త, వ్యర్థాలను ఇష్టారీతిగా కాల్చుతుండటంతో వచ్చే పొగ కారణంగా వాయి కాలుష్యమై,ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యర్థాలను కాల్చివేయడం కారణంగా దుర్వాసన రావడంతో వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నామని చుట్టుపక్కల రైతులు మండిపడుతున్నారు. ఈ హాచరీస్ ఓ మాజీ ఎంపీకి చెందినది కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని, జరుగుతున్న దారుణానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయులకు శుభవార్త

- మస్కట్ ద్వారా స్వదేశానికి తిరిగొచ్చేందుకు అవకాశం
- రోడ్డు మార్గం ద్వారా మస్కట్ చేరుకుని ఇండియాకు రావొచ్చు
- ప్రవాస భారతీయులు ఆందోళన చెందవద్దన్న కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ మహా :** అమెరికా ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాలైన దుబాయి, ఖతార్, బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా దేశాల్లో నివసిస్తూ ఆందోళన చెందుతున్న ప్రవాస భారతీయులకు శుభవార్త. ఇకపై వారు ఆందోళన చెందనక్కర్లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. వారంతా స్వదేశానికి తిరిగి రావడానికి కేంద్రం చేసిన ప్రయత్నాలు ఫలించాయని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయులు రోడ్డు మార్గం ద్వారా ఒమన్ లోకి ప్రవేశించి అక్కడి నుండి భారత్ కు వచ్చేందుకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ మేరకు మస్కట్ లోని భారతీయ రాయబార కార్యాలయం ఒక ప్రకటన కూడా విడుదల చేసినట్లు తెలిపారు. ఈ లెక్కన దుబాయి నుండి మస్కట్ ఎయిర్ పోర్టు వరకు రావాలంటే రోడ్డు మార్గాన 450 కి.మీలు ప్రయాణించాలి. అట్లాగే ఇతర గల్ఫ్ దేశాల నుండి మస్కట్ కు రోడ్డు మార్గాన రావాలంటే దాదాపు వెయ్యి కి.మీల వరకు ప్రయాణం చేయాలి.

- అలా చేరుకున్న వారంతా ఒమన్‌లోకి ప్రవేశించడానికి ముందుగానే విజిట్/టూరిస్ట్ వీసా పొందడం తప్పనిసరి. ప్రయాణికులు "రాయల్ ఒమన్ పోలీస్ వెబ్‌సైట్" ద్వారా అనుమతించిన ట్రావెల్ ఏజెంట్ల ద్వారా ముందుగా ఈవీసాకు దరఖాస్తు చేయాలి.
- అమెరికా, యూకే, కెనడా, జపాన్ లేదా షెంగెన్ దేశాల చెల్లుబాటు అయ్యే వీసా లేదా నివాస అనుమతి ఉన్న భారత పాస్‌పోర్ట్ దారులకు 'ఆన్‌అరైవల్ వీసా' సదుపాయం ఉంది. వారు రిటర్న్ టికెట్, హోటల్ బుకింగ్, ఆరోగ్య బీమా ఉన్నట్లయితే ముందస్తు వీసా లేకుండా గరిష్టంగా 14 రోజుల వరకు ఒమన్‌లో ప్రవేశించవచ్చు.
- గల్ఫ్ సహకార మండలి (GCC) దేశాలు అయిన బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలో నివసిస్తూ చెల్లుబాటు అయ్యే రెసిడెంట్ కార్డ్ కలిగిన భారత పౌరులకు కూడా "ఆన్‌అరైవల్ వీసా" అందుబాటులో ఉంటుంది.
- వీసాకు దరఖాస్తు చేసే సమయంలో పాస్‌పోర్ట్ కనీసం 6 నెలలపాటు చెల్లుబాటు అయ్యేలా ఉండాలి.భారత్ కు తిరిగి రావాలనుకునే గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయులంతా ఏదైనా సమాచారం కావాలంటే ఒమన్ లోని భారతీయ రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు.

ఉద్యమకారులను గుర్తించడానికి

చట్టబద్ధత కలిగిన

# కమిటీని వేయాలి

**సంగిశెట్టి క్రిస్టఫర్, మలిదశ ఉద్యమకారుడు**

**వలిగొండ, మహా :** రాష్ట్ర సాధన కోసం పోరాటలు చేసిన ఉద్యమకారులను గుర్తించడానికి చట్టబద్ధత కలిగిన కమిటీ వేయాలని రాజకీయాలకు ఎలాంటి తావు లేకుండా ఉండాలని లేకుంటే ఉద్యమకారులు నష్టపోయే ప్రమాదం ఉన్నదని మలిదశ ఉద్యమకారుడు టియు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ప్రభుత్వం సబ్ కమిటీతో పాటు జుడిషియల్ చట్టబద్ధత కలిగిన కమిటీ వల్లనే నిజమైన నికార్సైన ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందన్నారు లేకుంటే ఉద్యమకారులు నష్టపోయి ఎలాంటి ఉద్యమంతో సంబంధంలేని వారికి లాభం చేరే అవకాశాలు ఉన్నందున అలాంటి వాటికి చోటు ఇవ్వొద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

కొంగరకలాన్ ప్రభుత్వ పాఠశాలలో

# ఘనంగా వార్షిక దినోత్సవ వేడుకలు

- సంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు
- విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కొంగరకలాన్ జిల్లా ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో వార్షిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, కొంగరకలాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ప్రధానోపాధ్యాయులు బి రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వార్షిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా సోహెమ్ రోబోటిక్స్ ఎక్స్ బిషన్ లో 395 ప్రదర్శనలు చేయగా, 75 పాఠశాలలకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. కొంగరకలాన్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పాల్గొన్న విద్యార్థులకు ఉపాధ్యాయులకు బహుమతులు రావడం గర్వించదగ్గ విషయం అని అన్నారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన వార్షిక దినోత్సవ వేడుకలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను చాలా అద్భుతంగా ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాలకు గైహాజరు కాకుండా ప్రతిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యులు కాకి రవీందర్ ముదిరాజ్, ముద్దం శంకర్ గౌడ్, గోదాస్ రవీందర్ ముదిరాజ్, బహుజన్ సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బంగారిగళ్ళ మహేందర్, లింగళ్ళ భాస్కర్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని

# అందించడమే లక్ష్యం

**ఉత్తమ సేవలకు అవార్డు**

**కుషాయిగూడ, మహా :** బాల వికాస స్వచ్ఛంధ సంస్థ హైదరాబాద్ డివిజన్ డైరెక్టర్ బూడిద వెంకటేష్ జవహర్నగర్, ఫిబ్రవరి 28: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడమే తమ లక్ష్యమని బాల వికాస స్వచ్ఛంధ సంస్థ హైదరాబాద్ డివిజన్ డైరెక్టర్ బూడిద వెంకటేష్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జవహర్నగర్కు చెందిన బాల వికాస స్వచ్ఛంధ సంస్థ హైదరాబాద్ డివిజన్ డైరెక్టర్ బూడిద వెంకటేష్ ఉత్తమ సేవలు కనబర్చినందుకు శనివారం హన్మకొండలో నిర్వహించిన మహాసభలో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ల అభివృద్ధికోసం కమిటీలు ఎంతో దోహదపడతాయని, నాణ్యతగల వాటర్ క్యాన్లను ప్రజలకు అందజేస్తున్నామని అన్నారు. బాలవికాస సంస్థ హైదరాబాద్ మహానగర ప్రజలకు తాగునీటిని అందిస్తూ మన్ననలు పొందుతుందని తెలిపారు. ఉత్తమ సేవలకుగాను అవార్డు అందుకున్నందుకు ఆనందంగా ఉందని, దీంతో నాపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పి అండ్ జి బెటియన్ స్కాలర్‌షిప్ ప్రాజెక్ట్ కింద మూడు రోజుల బూట్‌క్యాంప్







**కుషాయిగూడ, మహా :** హైదరాబాద్‌లోని సాయి కృపా ప్రైవేట్ ఐటీఐలో పి అండ్ జి బెటియన్ స్కాలర్‌షిప్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల బూట్‌క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం నలభై మంది బాలికలు చురుకుగా పాల్గొన్నారు. బూట్‌క్యాంప్ సందర్భంగా సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ బృందం పాల్గొన్న విద్యార్థినుల కోసం ఇంటరాక్టివ్ మరియు నైపుణ్యాభివృద్ధి సెషన్‌లు నిర్వహించింది. మూడు రోజుల పాటు ఎస్ టి వి ఎం అవగాహన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ మీన్), కాన్వా వినియోగం, లింక్డ్ఇన్ ప్రొఫైల్ రూపకల్పన, కెరీర్ మార్గాలు, ఆర్థిక అక్షరాస్యత వంటి ముఖ్య అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులు ప్రతి సెషన్‌లో ఉత్సాహంగా పాల్గొని తమ ఆసక్తిని చాటుకున్నారు. ప్రాక్టర్ అండ్ గాంబుల్ మద్దతుతో అమలు అవుతున్న ఈ స్కాలర్‌షిప్ ప్రాజెక్ట్ దేశంలోని 7 రాష్ట్రాల్లోని సుమారు 20 జిల్లాలలో ఉన్న ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎస్ టి ఈ ఎం విద్యను అభ్యసిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన బాలికలను లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్థిక సహాయం అందించడంతో పాటు, డిజిటల్ నైపుణ్యాలు, కెరీర్ అవగాహన, భవిష్యత్ అవకాశాలపై నమ్మకాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. విద్యార్థినులకు ప్రాయోగిక జ్ఞానం, డిజిటల్ పరిజ్ఞానం, కెరీర్ దిశలో స్పష్టత కల్పించడంలో ఈ బూట్‌క్యాంప్ కీలక పాత్ర పోషించింది.

# ఇజ్రాయిల్ అమెరికా దాడిని ఖండించండి

### సీఐటీయూ నిరసన ప్రదర్శన



**కుషాయిగూడ, మహా :** ఇరాన్ పై శనివారం ఉదయం తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో జరిగిన ఇజ్రాయిల్,అమెరికా దాడిని నిరసిస్తూ సిఐటియు కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనను నిర్వహించారు.ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తు యుద్ధం వద్దు శాంతి కావాలని కోరుతూ ఈ సందర్భంగా జరిగిన నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి. శ్రీనివాసులు, జిల్లా మాజీ అధ్యక్షులు కోమటి రవి ఈ దాడిని ఖండిస్తూ ఇరాన్ దేశ సార్వభౌమాధికారాన్ని,ఐక్యరాజ్యసమితి నిబంధనావళి, అన్ని అంతర్జాతీయ ఒప్పందాలను దారుణంగా ఉల్లంఘిచాయని,చర్చలను పూర్తిగా విస్మరించి, అమెరికా,ఇజ్రాయిల్ ఈ దాడులకు పాల్పడ్డాయని ట్రంప్ చేస్తున్న ప్రకటనలను, ఈ దాడులను బట్టి స్పష్టమవుతుంది అన్నారు. సార్వభౌమ దేశాలపై తన ఇష్టానుసారం దాడులకు దిగుతూ యుద్ధోన్మాదంతో కూడిన బెదిరింపు ధోరణిలో అమెరికా వ్యవహరిస్తుంది. ఇటీవలే వెనుజులాపై అమెరికా జరిపిన దాడికి ఇది కొనసాగింపుగానే, ఇరాన్ పై దాడి చోటుచేసుకుంది అని అన్నారు. ఇజ్రాయిల్ లో భారత ప్రధాని నరేంద్ర మోడీ తన పర్యటన ముగించుకొని వచ్చిన వెంటనే ఇరాన్ పై దాడి ప్రారంభమైంది.తన మిత్ర దేశమైన ఇరాన్ పై జరుగుతున్న ఈ దాడిని భారత ప్రభుత్వం నిర్ద్వంద్వంగా ఖండించాలి అని అన్నారు. ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ జరిపిన సైనిక దాడులను రష్యా,చైనా తీవ్రంగా నిరసనను వ్యక్తం చేశాయి. ఇరాన్ పై ఏక కాలంలో అమెరికా, ఇజ్రాయిల్ విరుచుక పడ్డాయి. స్కూల్స్ పై జరిగిన సైనిక దాడిలో 85 మంది స్కూలు విద్యార్థులు 200మంది పౌరులు మృతి చెందారు. ఇరాన్ సుప్రీమ్ లీడర్ ఖమేని నివాసం పై దాడులు జరిపారు. ఈ దాడులలో ఆయన అల్లుడు, కోడలు మృతి చెందారు. ఇరాన్ సుప్రీం లీడర్ కమేని, ఇరాన్ రక్షణ మంత్రి,సైన్యాధిపతి మృతి చెందారు.ఇరాన్ ప్రతి దాడులతో అమెరికా స్థానిక సైనిక స్థావరాలు అయినా యూఏఈ, ఖాతార్,బహ్రెయిన్ కువైట్,సౌదీ దేశాలలోని పలు అమెరికా విరుచుకబడింది. దీనితో మధ్య ప్రాచ్యం లో యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా హార్మోజ్ జలసంధినీ మూసి వేస్తానని తెలిపింది.చమురు వాణిజ్య రవాణా జలసంధిగా పేరు గాంచిన ఈ జల సంధిని మూసివేస్తే ప్రపంచ వాణిజ్యం పై తీవ్ర ప్రభావం పడుతుంది. దీనితో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. వెంటనే ఐక్యరాజ్యసమితి చర్చలు,సంప్రదింపులు ద్వారా యుద్ధ వాతావరణం ను నివారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి. యాదగిరి రావు, పి. బి.చారి,ఎం. శ్రీనివాసరావు, సతీష్,లోకేష్ రెడ్డి,ఎం.శ్రీనివాసరావు,, జలీల్ భాష, ఉన్నికృష్ణ, శ్రీమన్నారాయణ,శివరామకృష్ణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లొంగుబాట్లు విప్లవానికి ద్రోహం

### మాజీ మావోయిస్టు నేత సుదర్శన్ తీవ్ర విమర్శలు



**కుషాయిగూడ, మహా :** ఇటీవల తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నూనె నరసింహారెడ్డి, దామోదర్ అలియాస్ జగన్‌లపై మాజీ మావోయిస్టు నేత సుదర్శన్ అలియాస్ శ్రీరాముల శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లొంగిపోయిన అనంతరం ముఖ్యమంత్రితో ఫోటోలు దిగడం, రాహుల్ గాంధీని కలవడం ద్వారా విప్లవ ప్రజానీకాన్ని గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు. రివార్డుల కోసం అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడం పాలకవర్గాల ముందు మోకరిల్లడమేనని సుదర్శన్ మండిపడ్డారు.మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాలకు వెన్నుపోటు పొడిచి, బూర్జువా పార్టీలతో కలిసి తిరగడం విప్లవ మార్గానికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. గత 70 సంవత్సరాలుగా నక్సల్‌బరీ ఉద్యమంలో అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని, వాటిని అవహేళన చేయడమే ఈ లొంగుబాట్లని ఆరోపించారు. తిప్పిరి తిరుపతి వంటి సీనియర్ నాయకుడు రివార్డుల కోసం అడగడం దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా లొంగిపోయిన మావోయిస్టులు ఏ రాజకీయ పార్టీలో చేరకుండా నిజాయితీగా జీవించాలని సూచించారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ 18 రాష్ట్రాల్లో విస్తరించి ఉందని, లొంగుబాట్లు, అరెస్టుల కారణంగా పార్టీ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని తెలిపారు. దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి, దామోదర్ అలియాస్ జగన్, పుల్లూరి ప్రసాదరావు, మల్లోజుల వేణుగోపాల్ వంటి అగ్ర నేతలు తమ అభిప్రాయాలను ప్రజల ముందుకు తీసుకురావాలని సుదర్శన్ డిమాండ్ చేశారు.విప్లవ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండడమే నిజమైన పోరాటమని, వ్యక్తిగత లాభాల కోసం ఉద్యమాన్ని తాకట్టు పెట్టడం చరిత్ర క్షమించదని ఆయన హెచ్చరించారు.

### చెరువుల్లో 'చెత్త' డంపింగ్ తో

# జలాశయాలు కలుషితం

### మృత్యువు అంచున తటాకాలు

**కుషామాయిగూడ, మహా :** ఒకప్పుడు ఊరికి ప్రాణాధారంగా, సాగునీటికి నిలయంగా ఉన్న చెరువులు నేడు 'డస్ట్ బిన్'లుగా మారుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, భవన నిర్మాణ శిథిలాలు, రసాయన వ్యర్థాలతో చెరువులు నిండిపోయి, అస్థిత్వాన్ని కోల్పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజల్లో అవగాహన లోపం వెరసి జలాశయాలు మురుగు కుంటలుగా మారుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, కీసర సర్కిల్, జవహర్ నగర్ పరిధిలోని చెన్నాపురం చెరువు

**ప్రధాన సమస్యలు ..**

ప్లాస్టిక్ కాలుష్యం చెరువుల్లోకి వచ్చి చేరుతున్న ప్లాస్టిక్ వల్ల నీరు కలుషితం కావడమే కాకుండా, భూగర్భ జలాల రీఛార్జ్ ఆగిపోతోంది.

**ఆక్రమణలకు దారి:**

ముందుగా చెత్త వేసి చెరువును పూడ్చివేయడం, ఆ తర్వాత దాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టడంగా మారింది.

**జీవవైవిధ్యం దెబ్బతినడం:**

నీటిలోని ఆక్సిజన్ స్థాయి తగ్గి చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయి, పక్షుల రాక కూడా గణనీయంగా తగ్గింది.

**వ్యాధుల ప్రబలం:**

చెత్త కుళ్ళిపోవడం వల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం చెరువుల్లో వ్యర్థాలను వేయడం శిక్షార్హమైన నేరం. మున్సిపల్ చట్టాల ప్రకారం భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి.



**పరిష్కార మార్గాలు**

**నిరంతర నిఘా:** చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సి.సి. కెమెరాల ద్వారా నిఘా ఉంచాలి.

**ప్రజల భాగస్వామ్యం:**

స్థానిక ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించి, చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపేలా ప్రోత్సహించాలి.

**కఠిన చర్యలు:**

వ్యర్థాలను పారబోసే వ్యక్తులు, సంస్థలపై భారీ జరిమానాలు విధించాలి.

**పూడిక తీత:**

కలుషితమైన చెరువులను ప్రక్షాళన చేసి, గుర్రపుడెక్క వంటి కలుపు మొక్కలను తొలగించాలి. చెరువులు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు, అవి ఒక నాగరికతకు చిహ్నాలు. వాటిని కాపాడుకోవడం మనందరి కనీస బాధ్యత. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కలిసికట్టుగా అడుగు వేస్తేనే మన జలవనరులను భావి తరాలకు అందించగలం

1) గుర్రపు డెక్కతో నిండిన చెరువు
2) చెరువులో వ్యర్థాల పారబోత

# తిమాజీపేట మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత

**నాగర్ కర్నూల్ మహా :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం తిమాజీపేట మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సాయం అందించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు లబ్ధిదారుల కృతజ్ఞతలు ప్రజల సంక్షేమం కోసం మరింత సమర్థంగా పనిచేస్తామని ఎమ్మెల్యే హామీ రాష్ట్ర అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపుకార్యక్రమంలో తిమాజీపేట మండల్ ప్రెసిడెంట్ వెంకట్ రామ్ రెడ్డి పాల్గొన్నారు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, గ్రామస్తులు హాజరు.



### కుమ్మెర ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి..

# దోషులను కఠినంగా శిక్షించండి

### డిజిపి శశిధర్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు

**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** కుమ్మెర గ్రామం జాతరలో జరిగిన పరస్పర దాడులు, చిన్నారి మృతి ఘటనలకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఈర్లపల్లి శంకర్ శనివారం రాత్రి డిజిపి శివశంకర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సంఘటనలు జరగడం దురదృష్టకరం. ఈ సంఘటనలు జరగడానికి దారి తీసిన పరిస్థితుల పై లోతుగా విచారణ జరపండి. ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా మేము పూర్తిగా సహకరిస్తాము. దోషులు ఏ స్థాయి వారు అయినా, ఏ పార్టీ వారు అయిన సరే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేలు డిజిపి కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈ విషయంపై ఇప్పటికే విచారణ కొనసాగుతోంది.. పూర్తిస్థాయి విచారణ జరిపించి నిజా నిజాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.



### సనాతన ధర్మ పరిరక్షణ కోసం

# రౌండ్ టేబుల్ సమావేశం ఘనంగా నిర్వహించబడింది

### ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డా. కుచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరయ్యారు

నాగర్ కర్నూల్ జిల్లా మహా : ఎమ్మెల్యే మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి భారతీయుడి కర్తవ్యమని పేర్కొన్నారు. సమాజంలో ధార్మిక విలువలు, ఆచారాలు, సంప్రదాయాలను కాపాడటంలో అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ధార్మిక చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని దేవాలయాలు, ధార్మిక మరియు ఆధ్యాత్మిక సంస్థలు, కుల సంఘాలు, అర్చకులు, పౌరోహిత్య సంఘాల ఐక్యవేదికగా ఏర్పడి సనాతన ధర్మ పరిరక్షణ కోసం కలిసి పనిచేయడం అభినందనీయమని తెలిపారు.స్వామీజీలు, పీఠాధిపతులు, గురూజీల మార్గదర్శకత్వంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ధార్మిక చైతన్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**రెడ్డి సేవ సమితి ఆధ్వర్యంలో ఏటిగడ్డ నరసింహా రెడ్డి – రెడ్డి కన్వెన్షను ప్రారంభించిన ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి.**

నాగర్ కర్నూల్ మహా : ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, కన్వెన్షన్ హాల్ అభివృద్ధికి అవసరమైన జనరేటర్, రహదారుల ఏర్పాటుతో పాటు అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అలాగే పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు రెడ్డి సేవా సమితి ద్వారా నాణ్యమైన విద్య, ఆర్థిక సహాయం అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్క విద్యార్థి ముందుకు రావాలని ఆకాంక్షించారు.కన్వెన్షన్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని, అవసరమైన ప్రతి పని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సమితి సభ్యులు, పాల్గొన్నారు..




### ఏటిగడ్డ నర్సింహ రెడ్డి- రెడ్డి కన్వెన్షన్ (కళ్యాణ మండపం)ను

# ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి..

**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** జిల్లా కేంద్రంలోని మంతటి చౌరస్తా సమీపంలో రెడ్డి సేవాసమితి నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఏటిగడ్డ నర్సింహ రెడ్డి రెడ్డి కన్వెన్షన్ ను ప్రారంభించిన మాజీ శాసన సభ్యులు శ్రీ మర్రి జనార్దన్ రెడ్డి.ఈ సందర్భంగా కల్యాణ మండపం నిర్మాణం కోసం కోటి రూపాయలు అందించి మళ్లీ 50 లక్షలు అందజేస్తానని ప్రకటించిన ఏటిగడ్డ వెంకటేశ్వర రెడ్డి ని అభినందించారు తన వంతు సహాయంగా రెడ్డి సేవ సంఘానికి,కళ్యాణ మండపం అభివృద్ధికి 25 లక్షల రూపాయలు త్వరలో అందజేస్తానని తెలిపారు రెడ్డి సేవా సంఘం అభివృద్ధి కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం సభ్యులు పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




### మూడు నెలల చిన్నారిని నీటి తొట్టిలో వేసి హత్య చేసిన ఘటనను ఖండిస్తూ

# వేగవంతంగా విచారణ పూర్తి చేయాలి

### ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి


**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** పాలెం గ్రామంలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై ఎంపీ మల్లు రవి ,ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మూడు నెలల చిన్నారిని నీటి తొట్టిలో వేసి హత్య చేసిన ఘటనను ఖండిస్తూ, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.ఆదివారం పాలెం గ్రామాన్ని సందర్శించిన వారు సంఘటన వివరాలను తెలుసుకొని, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో చిన్నారులపై మృతి సంఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపించి, నిందితులను త్వరగా పట్టుకుని కఠిన శిక్షలు విధించాలని పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని తెలిపారు..





# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL





# ప్రియుడికి వివాహమైందని తెలిసి..

న్యూఢిల్లీ: ఓ యువతి తనతో రెండేళ్లుగా సంబంధం నెరపుతున్న యువకుడికి అప్పటికే పెళ్లయిందని తెలుసుకుని కక్షతో రగిలిపోయింది. నమ్మకంగా పిలిపించుకుని, మత్తు మందిచ్చి, అతడి మర్మావయవాలను కోసేసింది. తీవ్ర గాయాలతో అతడు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఫిబ్రవరి 25వ తేదీన ఢిల్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు(22) హిందూరావ్ ఆస్పత్రిలో తీవ్ర గాయాలతో చేరాడు. ఆస్పత్రి అధికారుల సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాధితుడిని యూపీలోని రాంపూర్‌కు చెందిన ఆర్ఎంపీగా పనిచేసే విసర్జీత్‌గా గుర్తించారు. ఇతడికి రెండేళ్ల క్రితం ఢిల్లీలోని వజీరాబాద్‌కు చెందిన అమీనా ఖాతూన్‌తో పరిచయమేర్పడింది. ఫిబ్ర వరి 24వ తేదీన అమీనా వద్దకు విసర్జిత్ వచ్చాడు. ఆ రోజు రాత్రి అతడికి అమీనా మత్తు పదార్థం కలిపిన పాలను తాగించింది. మత్తులోకి జారుకున్నాక అతడి మర్మాయవాలను పదునైన ఆయుధంతో కోసేసింది. అప్పటికే పెళ్లయినా కాలేదని విసర్జిత్ చెప్పడంతో ఆగ్రహంతోనే ఆమె ఈ ఘాతుకానికి పాల్పడిందని పోలీసులు భావిస్తున్నారు. తెల్లారాక విసర్జీత్ గాయాలతో దగ్గర్లోని హిందూరావ్ ఆస్పత్రిలో చేరాడు. వివిధ సెక్షన్ల కింద అమీనాపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న ఆమె కోసం గాలిస్తున్నారు. అమీనా స్వస్థలం బిహార్‌లోని కటిహార్ ప్రాంతం.

# బీజేపీ పాలనకు కౌంట్‌డౌన్

### జంతర్‌మంతర్ ర్యాలీలో కేజ్రీవాల్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ కోర్టు తీర్పుతో మద్యం పాలసీ కేసు నుంచి బయటపడిన 48 గంటలైనా గడవకముందే ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలపై విమర్శల దాడి మొదలుపెట్టారు. అధికార పీఠం నుంచి బీజేపీని కిందికి దించేందుకు కౌంట్‌డౌన్ మొదలైందంటూ విరుచుకుపడ్డారు. ఆదివారం జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆప్ ర్యాలీలో కేజ్రీవాల్ మాట్లాడారు. మద్యం విధానం కేసులో తనను అక్రమంగా ఇరికించేందుకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కుట్రపన్నారని ఆరోపించారు. అయితే, కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు తాను కరుడుగట్టిన నిజాయతీపరుడన్నది రుజువైందంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీలో భయమొదలైందంటూ ఆయన..నిరంకుశుడు ఇలా భయపడుతున్నాడంటే దానర్థం..అతడి పాలనకు ముగింపు దగ్గరపడున్నట్లేనని పేర్కొన్నారు. చిన్నారుల విద్య కోసం పోరాడిన, శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను మోదీయే జైలులో పెట్టించారు. మహిళా ఎంపీలు దాడి చేస్తారనే భయంతోనే ఆయన ఒక రోజు పార్లమెంట్‌కు వెళ్లలేదు. ట్రంప్ అన్నా మోదీకి భయమే' అని కేజ్రీవాల్ దుయ్యబట్టారు. దేశంలో బీజేపీ 12 ఏళ్ల పాలనలో అన్ని రంగాలు నాశనమయ్యాయన్నారు. రహదారులు, ఆరోగ్య రంగం, విద్య, పారిశుధ్యం..ఇలా అన్నీ దారుణంగా మారాయని విమర్శించారు. జీవించగలిగే భారత్‌ను ప్రజలు కోరుకుంటుండగా వికసిత్ భారత్ అంటూ ప్రధాని మోదీ ప్రచారం చేసుకుంటున్నార న్నారు. పరీక్షా పే చర్చ పేరుతో డ్రామాలు ఆపి, పరీక్ష పత్రాల లీకేజీని అరికట్టాలన్నారు. ఏడాది పాలనలోనే ఢిల్లీని బీజేపీ నాశనం చేసిందని మండిపడ్డారు. దేశానికి మోదీ చేసిందేమీ లేదంటూ కేజ్రీవాల్..కుట్రలు, ఓటర్ల జాబితా అవకతవకల ద్వారానే ఆయన అధికారంలో కొనసాగుతున్నారంటూ ఆరోపించారు.



# డీఎంకే సర్కార్ అవినీతిమయం

### పేదలు, రైతులు, యువతను దోచుకుంది: మోదీ

చెన్నై/పుదుచ్చేరి: తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయంగా మారిపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. డీఎంకే మంత్రులు అవినీతిలో పరస్పరం పోటీపడుతున్నారని విమర్శించారు. డీఎంకే సర్కారు అవినీతికి పాల్పడడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. పేదలు, రైతులు, యువతను దోచుకుందని ధ్వజమెత్తారు. ఈ అవినీతి ప్రభుత్వానికి ఇకపై అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని తేల్చి చెప్పారు.ప్రధాని మోదీ ఆదివారం తమిళనాడులో పర్యటించారు. రూ.4,400 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. అనంతరం మదురైలో బహిరంగ సభలో ప్రసంగించారు. అవినీతి, అసమర్థ పాలనతో తమిళనాడు ప్రజలు విసుగెత్తిపోయారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కచ్చతీవులను శ్రీలంకకు అప్పగించి తమిళనాడుపై కక్ష తీర్చుకుందన్నారు. తమకు అధికారం అప్పగిస్తే తమిళనాడును అత్యున్నత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఏఐఏడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి, ఏఎంఎంకే వ్యవస్థాపకుడు టీటీవీ దినకరన్, పీఎంకే నేత అన్బుమణి రాందాస్ సభలో పాల్గొన్నారు.



**పుదుచ్చేరిని ఏటీఎంగా మార్చుకున్న కాంగ్రెస్**

పుదుచ్చేరిని గతంలో ఢిల్లీలోని ఒక కుటుంబానికి ఏటీఎంగా కాంగ్రెస్ మార్చేసిందని మోదీ నిప్పులు చెరిగారు. ఆదివారం అక్కడ రూ.2,714 కోట్ల ప్రాజెక్టులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తర్వాత సభలో మాట్లాడారు. పుదుచ్చేరి అభివృద్ధికి ఆ కాంగ్రెస్, డీఎంకే స్పీడ్ బ్రేకర్‌గా మారాన్నారు. బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ డబుల్ ఇంజిన్ పాలనలో పుదుచ్చేరి ప్రగతి పథంలో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. మోదీ ఆదివారం తమిళనాడులో తిరుప్పరకుండ్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మోదీ దోతీ, కుర్తా ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పూజల్లో పాల్గొన్నారు.

# ఖమేనీ మృతితో జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్తత

శ్రీనగర్: ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మృతితో జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్తతలు తలెత్తాయి. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వెలువడటంతో ఆదివారం కశ్మీర్ లోయతో పాటు జమ్మూలోని పలు ప్రాంతాల్లో నిరసనలు మిన్నంటాయి. షియా సామాజిక వర్గం అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి, తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ, ప్రజలందరూ సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.అయతొల్లా అలీ ఖమేనీ మృతి దరిమిలా శ్రీనగర్ సహా కశ్మీర్‌లోని మెజారిటీ ప్రాంతాలు, జమ్ము శివారులోని భటిండి, రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో శాంతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ముఖ్యమంత్రి.. ఇరాన్‌లో ఉన్న జమ్ముకశ్మీర్ విద్యార్థులు, ఇతరుల భద్రత విషయంలో తమ ప్రభుత్వం కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతోందని భరోసా అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే వారిపై బలప్రయోగం చేయవద్దని, పోలీసులు, పరిపాలనా యంత్రాంగం నిగ్రహంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 'ఎక్స్' వేదికగా కోరారు. మరోవైపు ఈ ఆకస్మిక నిరసనల నేపథ్యంలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిశితంగా గమనించాలని జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.



# నిర్మాతగా రామ్ చరణ్..

## స్వయంగా ప్రకటించిన టాలీవుడ్ హీరో



నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ మూవీ స్వయంభు. ఇటీవలే టీజర్ రిలీజ్ చేయగా అద్భుతమైన విజువల్స్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఈ మూవీ విజువల్స్ బాహుబలి రేంజ్‌లో ఉన్నాయంటూ ప్రశంసలొచ్చాయి. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న సమ్మర్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరైన హీరో తన కొత్త సినిమాలపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ ఏడాది తాను మూడు చిత్రాలు చేస్తున్నట్లు ప్రకటించారు. స్వయంభుతో పాటు మరో రెండు సినిమాలు కూడా ఉన్నాయని తెలిపారు. స్వయంభు తర్వాత ఇండియా హౌస్ అనే సినిమా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మూవీకి గ్లోబల్ స్టార్, మెగా హీరో రామ్ చరణ్ నిర్మాతగా వ్యవహరించనున్నారని నిఖిల్ స్వయంగా ప్రకటించారు. ఆ తర్వా కార్తికేయ 3 కూడా వస్తుందని నిఖిల్ ఫ్యాన్స్‌కు గూస్ బంప్స్ తెప్పించేలా మాట్లాడారు. కాగా..స్వయంభు చిత్రంలో సంయుక్తమీనన్, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సునీల్ సుబ్బరాజు, సత్య కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగాయ.. రవి బస్రూర్ సంగీతమందించారు.



# మోదీగారు.. నన్ను క్షేమంగా భారత్‌కు తీసుకురండి

ఇరాన్‌పై యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్, బహ్రెయిన్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లలో ఉన్న భారతదేశ ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయం గుప్పిట్లో బతుకుతున్నారు. దుబాయ్‌లో టాలీవుడ్ హీరో మంచు విష్ణుతో పాటు బాలీవుడ్ నటి సోనాల్ చౌహాన్ కూడా చిక్కుకుపోయింది. విమాన రాకపోకలు నిలిపివేయడంతో తిరిగొచ్చే దారి కనిపించడం లేదని సోషల్ మీడియాలో వాపోయింది.

**సాయం చేయండి**

గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీగారు.. ప్రస్తుత సంక్షభ పరిస్థితుల్లో నేను దుబాయ్‌లో చిక్కుకున్నాను. విమానాల రాకపోకలు ఆగిపోయాయి. ఇండియాకు ఎలా రావాలో తెలియడం లేదు. నేను సురక్షితంగా ఇంటికి చేరేందుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నాను అంటూ చేతులు జోడించి నమస్కరిస్తున్న ఎమోజీని జత చేసింది సోనాల్.

**సినిమా**

సోనాల్ చౌహాన్ మోడల్, సింగర్, హీరోయిన్. జన్నత్ చిత్రంతో హిందీలో, రెయిన్‌బో మూవీతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. లెజెండ్, పండగ చేస్కో, షేర్, సైజ్ జీరో, డిక్టేటర్, ఎఫ్ 3, ద ఘోస్ట్ వంటి చిత్రాల్లో నటించింది. తెలుగులో చివరగా ఆదిపురుష్ మూవీలో మండోదరిగా యాక్ట్ చేసింది. చివరగా దర్ద్ (2024) అనే ద్విభాషా చిత్రంలో తళుక్కుమని మెరిసింది.

# యశ్ టాక్సిక్..

## ట్రైలర్ రిలీజ్ ఎప్పుడంటే?



కేజీఎఫ్ హీరో, కన్నడ స్టార్ హీరో యశ్ నటించిన భారీ యాక్షన్ మూవీ టాక్సిక్. ఇటీవలే టీజర్, గ్లింప్స్ చేయగా అభిమానులను ఆకట్టుకున్నాయి. కానీ గ్లింప్స్ మరింత బోల్డ్‌గా ఉండటంతో చాలా విమర్శలు వచ్చాయి. కేజీఎఫ్ 2 వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత యష్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కావడంతో ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ డేట్ ప్రకటించారు మేకర్స్. మార్చి 8న టాక్సిక్ ట్రైలర్ రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. బెంగళూరులో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. కాగా.. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా కూడా కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీని కన్నడ, ఆంగ్లంలో ఓకేసారి చిత్రీకరించారు. ఈ సినిమాను హిందీ, తెలుగు, తమిళం, మలయాళం కూడా రిలీజ్ చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై నిర్మించిన ఈ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.



# ఆశ్చర్యపరుస్తున్న 'ధురంధర్ 2' రన్‌టైమ్..!

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ధురంధర్.. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ మూవీకి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. అయితే, ఈ మూవీ రన్‌టైమ్ గురించి సోషల్‌మీడియాలో పలు కథనాలు వైరల్ అవుతున్నాయి. పార్ట్ 1కు సెన్సార్ నుంచి A సర్టిఫికెట్ వచ్చింది. ఆపై దీని రన్‌టైమ్ 3.34గంటలుగా ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ మూవీ సీక్వెల్ రన్‌టైమ్ గురించి వస్తున్న వార్తలు చూస్తుంటే ఆందరిని ఆశ్చర్యపరుస్తుంది. 'ధురంధర్ 2: ది రివెంజ్' మూవీ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా సుమారు ఐదు భాషల్లో విడుదల కానుంది. బాలీవుడ్‌లో వస్తున్న వార్తల ప్రకారం ఈ మూవీ రన్‌టైమ్ 3.50 గంటలు ఉండొచ్చని తెలుస్తోంది. అయితే, మరి కొన్ని కథనాల్లో మాత్రం 3.40గంటలకు దగ్గరగా ఉంటుందని చెప్పుకొస్తున్నారు. ఈ మూవీ నిడివి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పార్ట్ 1కు మించే సీక్వెల్ రన్‌టైమ్ ఉంటుందని క్లారిటీ ఇస్తున్నారు. సుమారు 17ఏళ్ల తర్వాత ఈ రేంజ్ నిడివితో బాలీవుడ్‌లో సినిమా రావడం విశేషం. 2008లో హృతిక్ రోషన్ నటించిన 'జోథా అక్బర్' (3.50గంటలు) రన్‌టైమ్‌తో విడుదలైంది. అయితే, నిర్మాతల నుంచి ధురంధర్ తుది రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటన రాలేదు. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ వర్గాలు ప్రకారం రన్‌టైమ్ ఎక్కువగానే ఉందని సమాచారం. ధురంధర్ 2 లో సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్, సారా అర్జున్ కీలక పాత్రల్లో తిరిగి వస్తున్నారు. యామి గౌతమ్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపిస్తారని కూడా సమాచారం ఉంది. ఈ చిత్రాన్ని జియో స్టూడియోస్, బి62 స్టూడియోస్ కలిసి నిర్మిస్తున్నాయి.



# హీరోయిన్ కాస్ట్‌లీ చెప్పులు.. లక్ష పైచిలుకే!

'చీకటి గదిలో చితక్కొట్టుడు' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది నిక్కీ తంబోలి. కాంచన 3, తిప్పరా మీసం వంటి చిత్రాల్లో నటించినా తనకు పెద్ద గుర్తింపు రాలేదు. దాంతో ఐటం సాంగ్స్‌పై ఫోకస్ చేసింది. హిందీ బిగ్‌బాస్ 14వ సీజన్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొని సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. లేటెస్ట్ రియాలిటీ షో ద 50లో కంటెస్టెంట్‌గా పార్టిసిపేట్ చేసి మరోసారి లైమ్‌లైట్‌లోకి వచ్చింది.

### గోవా ట్రిప్

తాజాగా ఆమె ద 50 షోలోని సహకంటెస్టెంట్లతో వెకేషన్‌కు వెళ్లింది. ఈ గోవా ట్రిప్‌కు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అందులో నిక్కీ బ్లూ కలర్ పొట్టి డ్రెస్‌లో తళుక్కుమని మెరిసింది. అయితే అందరి దృష్టి మాత్రం తను ధరించిన హీల్స్‌పైనే పడింది. కారణం ఏంటో తెలుసా? ఆ హీల్స్ డాల్స్ అండ్ గబ్బానా అనే లగ్జరీ బ్రాండ్‌కు చెందిన చెప్పులు.

### చెప్పుల ధర ఎంతంటే?

ఆ హీల్స్ ధర అక్షరాలా లక్ష 46 వేలని తెలుస్తోంది. నిక్కీ తంబోలికి మేకప్ దగ్గరినుంచి అలంకరణ వరకు అన్నీ ఖరీదైనవి వాడటం బాగా అలవాటు. ఈ విషయాన్ని ఆమె ప్రియుడు అర్బాజ్ పటేల్ కూడా ధ్రువీకరించాడు. తను వాడే మాయిశ్చరైజర్ ధర రూ.75 వేలు, సీరమ్ రూ.50 వేలు అని తెలిపాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com